RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 125 | మంగళవారం, జూన్ 18, 2024 | పేజీలు : 4

## ఎలాన్ మస్క్ కు సవాల్ విసిరిన పురందేశ్వరి!

విజయవాడ: ఈవిఎంలను హ్యాక్ చేయొచ్చని ఇటీవల ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు సంచలనం అయ్యాయి. ఈవిఎంల హ్యాకింగ్ పై పలువురు పలు రకాలుగా స్పందించారు. ఇటీవల రాహుల్ గాంధీ కూడా స్పందించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ బిజెపి చీఫ్ పురందేశ్వరి కూడా స్పందించారు. దమ్ముంటే ఇండియాలోని ఈవిఎంలను హ్యాక్ చేసి చూపాలని ఎలాన్ మస్క్ కు సవాలు విసిరారు. ఇది ఇప్పుడు ఏపిలో హాట్ టాపిక్ గా మారింది.

## ఆ కానిస్టేబుల్‌కు రేవంత్ అభినందనలు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌ను ప్రశంసించారు. యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కు వెళ్తున్న ఓ యువతిని కరెక్ట్ సమయంలో పరీక్షా కేంద్రానికి తరలించినందుకు సీఎం రేవంత్.. సురేష్‌ను అభినందించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా స్పందించిన ముఖ్యమంత్రి.. వాహనాల నియంత్రణ మాత్రమే తన డ్యూటీ అనుకోకుండా.. సాటి మనిషికి సాయం చేయడం తన బాధ్యత అని భావించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌కు అభినందనలు.. సురేష్ సహకారంతో సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్న సోదరి యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.. ఆల్ ది బెస్ట్ అని సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

# బెంగాల్ రైలు ప్రమాదంలో మృతులకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా



న్యూ జల్పాయిగురి/ కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లాలో సోమవారం ఉదయం సుమారు 9 గంటలకు ఆగి ఉన్న కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్‌ను ఒక గూడ్స్ రైలు ఢీకొనగా ఎక్స్‌ప్రెస్ వెనుకు బోగీలు మూడు పట్టాలు తప్పిన తరువాత కనీసం 15 మంది ప్రయాణికులు దుర్మరణం చెందినట్లు, మరి 60 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. అగర్తలా నుంచి బయలుదేరిన కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్ సీల్దా వెళ్లవలసి ఉంది. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు స్థానికులతో కలసి రాష్ట్ర, కేంద్ర సంస్థలు యుద్ధ ప్రాతిపదికపై పని చేస్తున్నందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో గూడ్స్ రైలు పైలట్, కో పైలట్ కూడా ఉన్నట్లు సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. క్షతగాత్రులను ఉత్తర బెంగాల్ వైద్య కళాశాల, ఆసుపత్రికి తరలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఉత్తర బెంగాల్ న్యూ జల్పాయిగురి స్టేషన్ నుంచి దాదాపు 30 కిలో మీటర్ల దూరంలోని రంగపాని స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు ఇంజన్ ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి ఢీకొన్న ప్రభావంతో మూడు వెనుక బోగీలు పట్టాలు తప్పినట్లు సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. 'పశ్చిమ బెంగాల్‌లో రైలు ప్రమాదం విషాదకరం. తమ ప్రియతములను కోల్పోయినవారికి సంతాపం తెలియజేస్తున్నా' అని ప్రధాని నరేంద్ర మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. అధికారులతో మాట్లాడి, పరిస్థితిని తెలుసుకున్నా. బాధితులకు రక్షణ, సహాయ కార్యక్రమాలు సాగుతున్నాయి. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రమాద స్థలానికి వెళుతున్నారు' అని మోడీ తెలిపారు. మృతులు ఒక్కొక్కరి సమీప బంధువులకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ. 50 వేలు ఇవ్వనున్నట్లు కూడా ప్రధాని ప్రకటించారు. రైలు ప్రమాదం నేపథ్యంలో సహాయ కార్యక్రమాల పర్యవేక్షణకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం పశ్చిమ బెంగాల్‌కు బయలుదేరి వెళ్లారు. రైల్వే అధికారుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రయాణికుల రైలు పట్టాలపై ఆగి ఉండగా వెనుక నుంచి గూడ్స్ రైలు ఢీకొన్నది. ఆ తీవ్ర ప్రభావానికి కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్ వెనుక బోగీలు రెండు వెంటనే పట్టాలపై నుంచి ఎగిరిపడగా, మరొక బోగీ గూడ్స్ రైలు ఇంజన్ కింద చిక్కుకుని వేలాడుతోంది. ఆ ప్రాంతంలో అననుకూల వాతావరణం సహాయ కార్యక్రమాలకు మరొక అవరోధంగా తయారైందని అధికారులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ రైలు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం పర్యవసానంగా ఉత్తర బెంగాల్, దేశంలోని ఈశాన్య ప్రాంతం నుంచి దూర ప్రాంత రైలు సర్వీసులకు అంతరాయం వాటిల్లింది.

**తెల్లవారు జామున 5.50 నుంచి సరిగ్గా పని చేయని సిగ్నల్**

ఇది ఇలా ఉండగా, పశ్చిమ బెంగాల్‌లోని రాణిపత్రా రైల్వే స్టేషన్, ఛత్తర్ హాట జంక్షన్ మధ్య ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ సోమవారం తెల్లవారు జామున 5.50 నుంచి సరిగ్గా పని చేయడం లేదని రైల్వే శాఖ ప్రతినిధి ఒకరు తెలియజేశారు. 'రైలు నంబర్ 13174 (సీల్దా కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్) ఉదయం 8.27 గంటలకు రంగపాని స్టేషన్ నుంచి బయలుదేరి, తెల్లవారు జామున 5.50 నుంచి ఆటోమేటిక్ సిగ్నలింగ్ వైఫల్యం వల్ల రాణిపత్రా రైల్వే స్టేషన్, ఛత్తర్ హాట్ మధ్య నిలిచిపోయింది' అని ఆ ప్రతినిధి వివరించారు.

## 19న కేంద్ర మంత్రులు కిషన్, బండి రాక



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి ఎల్లుండి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాబోతున్నారు. ఇక, కేంద్రమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తుండటంతో వారికి స్వాగతం పలికేందుకు భారతీయ జనతా పార్టీ భారీగా ఏర్పాట్లు చేస్తుంది. భారీ ర్యాలీతో పాటు బీజేపీ పార్టీ ఆఫీస్ దగ్గర సభ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ చుట్టూ పక్కల జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఇక, బుధవారం మధ్యాహ్నం బేగంపేట ఎయిర్ పోర్టు లో కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకి బీజేపీ శ్రేణులు భారీగా స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు ర్యాలీ తీయనున్నారు. ఆ తర్వాత సన్మాన సభలో పాల్గొంటారు. చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు దర్శించుకోనున్నారు. అయితే, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ శాఖలో అధికారులతో ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. ఈ నెల 30లోగా కనీసం ఆరు గనులను వేలం వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర సర్కార్ సూచించింది. ఇక, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ పదవి బాధ్యతలను తీసుకున్నా తర్వాత దేశవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిస్థితులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

## చంద్రబాబును చూసైనా రేవంత్ రెడ్డి నేర్చుకోవాలి: హరీశ్ రావు



**హైదరాబాద్:** పింఛన్ల పెంపు విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని చూసైనా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నేర్చుకోవాలంటూ మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు చెప్పినట్టే చంద్రబాబు నాయుడు రూ. 4 వేలకు పింఛన్లు పెంచారని ఆ మేరకు మొదటి సంతకం పెట్టారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చెప్పిన మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ని చూసైనా నేర్చుకోవాలని, రూ. 4 వేల పింఛన్లు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పక్షాన, గ్రూప్స్ అభ్యర్థుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఆరు నెలల్లో చెప్పిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కారు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## అవసరమైతేనే బయటకు వెళ్లండి... హైదరాబాద్ వాసులకు మంత్రి పొన్నం సూచన



**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఇవాళ భారీ వర్షం కురుస్తోంది. నగరంలోని మాదాపూర్, గచ్చిబౌలి, దుర్గం చెరువు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, పంజాగుట్ట, యూసుఫ్‌గూడ, బేగంపేట్‌తో పాటు పలు చోట్ల వాన పడుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కురుస్తోన్న భారీ వర్షాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాజా పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పొన్నం కీలక సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు అత్యవరసమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

## తమిళనాడులో ఓటమిపై కన్నీరు పెట్టుకున్న మోడీ!



చెన్నై: లోక్‌సభ ఎన్నికలలో తాము తమిళనాడులో ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయామంటూ ఇటీవల జరిగిన ఎన్‌డిఎ ఎంపీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ కన్నీటి పర్యంతమయ్యారని డిఎంకె సొంత పత్రిక మురసోలి సోమవారం తన సంపాదకీయంలో వెల్లడించింది. తాము ఎందుకు గెలవలేకపోయామో ఆయన చెప్పలేదు. అందుకు గల కారణాన్ని కూడా ఆయన గ్రహించినట్లులేదు. ఒకవేళ ఆయన గ్రహించినప్పటికీ కారణాన్ని మాత్రం ఆయన వెల్లడించరు. కారణాన్ని ఆయనచెప్పలేరు అని మురసోలి జూన్ 17 నాటి సంచికలోని సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. తమిళనాడులోని డిఎంకె సారథ్యంలోని ఇండియా కూటమి ఎన్నికల రాజీకయాల కోసమే కాక సిద్ధాంపరంగా కూడా బిజెపిని ఎండగడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం మాత్రమే ఈ కూటమి ఏర్పడలేదు. గత ఐదు సంవత్సరాలుగా ఫాసిస్టు బిజెపిపై ప్రజాస్వామిక యుద్ధాన్ని కూటమి సాగిస్తోంది. యావద్దేశానికి బిజెపి ప్రమాదకారి అని చెబుతూ గ్రామస్థాయి నుంచి సాగించిన ప్రచారంతో డిఎంకెకు, దాని మిత్రపక్షాలకు అఖండ విజయం లభించింది. బిజెపికి ఓటు వేస్తే తమిళ ప్రజలను అవమానించేనట్లేనని డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చేసిన వాదనను ప్రజలు అంగీకరించారు. తమిళనాడు, పుదుచ్చేరిలోని మొత్తం 40 లోక్‌సభ నియోజకవర్గాలలో ఇది ప్రతిబింబించింది అని మురసోలి తెలిపింది. తమిళనాడులోని మొత్తం 39 నియోజకవర్గాలు, పుదుచ్చేరిలోని ఏకైక నియోజకవర్గంలో డిఎంకె, దాని మిత్రపక్షాలైన, కాంగ్రెస్, వామపక్షాలు ఘన విజయం సాధించాయి.

## బెంగాల్ రైలు ప్రమాదం... మోడీ ప్రభుత్వంపై ఖర్గే ఫైర్



న్యూఢిల్లీ : రైల్వే మంత్రిత్వశాఖ 'దారుణ నిర్వహణ లోపానికి' మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో రైలు ప్రమాదంలో ప్రాణ నష్టం పట్ల ఖర్గే సంతాపం వ్యక్తం చేశారు. 'పశ్చిమ బెంగాల్ జల్పాయిగురిలో కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదం పట్ల ఎంతగానో విచారిస్తున్నా. ప్రమాదంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు' అని ఖర్గే తెలిపారు. 'ప్రమాద దృశ్యాలు బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఈ విషాద సమయంలో వారిలో ప్రతి ఒక్కరికీ మా సంఘీభావం, సంతాపం తెలియజేస్తున్నాం. క్షతగాత్రలు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. మృతులకు వెంటనే, పూర్తి పరిహారం అందజేయాలి' అని ఖర్గే అన్నారు. గడచిన పది సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం రైల్వే మంత్రిత్వశాఖ 'నిర్వహణలో దారుణంగా విఫలమైంది' అని ఆయన ఆరోపించారు. 'రైల్వే మంత్రిత్వశాఖను 'కెమెరా ఆధారిత' స్వోత్కర్షకు వేదికగా రైల్వే మంత్రిత్వశాఖను మోడీ ప్రభుత్వం ఏవిధంగా మార్చిందో నొక్కిచెప్పడం బాధ్యతాయుత ప్రతిపక్షంగా మా కర్తవ్యం' అని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు. 'ఈ దుర్ఘటన ఈ దారుణ వాస్తవాన్ని మరొకసారి గుర్తు చేస్తోంది' అని ఖర్గే పేర్కొన్నారు.

# ఘనంగా బక్రీద్ పర్వదిన వేడుకలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ముస్లిం సోదరులు మజీద్, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రత్యేకత బక్రీద్ పండుగాని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఉమ్మడి మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## సంపాదకీయం

# కుటుంబానికి నాన్నే వెన్నెముక....!

కుటుంబ వృక్షానికి కనిపించే కాండం అమ్మ అయితే కనిపించని తల్లి వేరు నాన్న. కుటుంబాభివృద్ధి యంత్రానికి ఇం'ధనం' నాన్న. సంతానాభివృద్ధికి మార్గదర్శే కాదు విలక్షణ కథానాయకుడు కూడా నాన్నే. కుటుంబ గౌరవ జ్యోతి ప్రజ్వలకర్త నాన్న. పుస్తకజ్ఞానం లేకపోయినా లోకరీతిని చదివిన మేధావి నాన్న. తన భుజాలు వంశ భారాన్ని మోసే వాహనాలు. కుటుంబ దేహానికి నాన్నే వెన్నెముక. అమ్మతో కలిసి అమృతాన్ని వితరణ చేసే పితృదేవులు నాన్న. నాన్న ఓ ఆత్మీయ నేస్తం, అవసరాల్ని తీర్చే హస్తం. దారితప్పిన పిల్లల్ని సన్మార్గంలో పెట్టి, వారి మనసులో ప్రతినాయకుడైయ్యేది నాన్నే. తన జీవితం కుటుంబానికే రక్షణ కవచం. తండ్రి త్యాగం అనన్య సామాన్యం. పిల్లల కంటికి రెప్ప పిత. బోధనలో గురువు, సాధనలో అనంత శక్తిమంతుడు. నాన్న చెమటే ఇంటి దీపపు చమురు. తడబడినపుడు తనో ఊతకర్ర, బెదిరినపుడు తనో కొండంత ధైర్యం. సన్మార్గ సందేశమే ఆయన అభిమతం. తండ్రి మనసు దూదంత మెత్తన, పాల నురగంత తెల్లన, వెన్నెలంత చల్లన. కుటుంబ లతకు పందిరి నాన్న. ఎదిగే సంతాన మొక్కలకు తనో ట్రీగార్డు. నాన్న శ్వాస కుటుంబ సంక్షేమం. కుటుంబ కాయానికి ప్రాణవాయువు, గాయానికి లేపనం నాన్న. తను కరుగుతూ వెలుగులు చిమ్మే కొవ్వొత్తి నాన్న. నాన్న బతుకు కష్టాలమయం, కుటుంబహితం. ప్రేమల ఊట బాయి, అనురాగాల అక్షయపాత్ర నాన్న. తనువు అలిసి సొలిసినా కుటుంబ నవ్వులతో శక్తిని పుంజుకొని బేషరతుగా సర్వస్వం దారబోసే నాన్న జీవితం మహోన్నత ఆదర్శ దీపస్తంభం. పిల్లల పెంపకంలో తనో పరిపాలనాదక్షుడు, అవసరమైతే ఆయనే చంఢశాసనుడు. అమ్మ జన్మనిస్తే, నాన్న జీవితపరమార్థాన్ని ప్రసాదిస్తాడు. అమ్మ తొలి అడుగు వేయిస్తే, నాన్న ప్రగతి పథం చూపుతాడు. అమ్మ తొలి పలుకు నేర్పితే, నాన్న జీవిత పాఠాల సుభాషితాలు నూరి పోస్తాడు. నాన్న లేనిదే సంతానం లేదు. కుటుంబ పోషణకే తన జీవితం అంకితం. అమ్మనాన్నల అన్యోన్యతే పిల్లల సుఖసంతోషాల కోవెల. ఆది గురువు అమ్మ అయితే లోకజ్ఞాన బోధకుడు నాన్న. మన జీవితాల్లో నాన్న స్థానం భర్తీ చేయలేని అద్వితీయ, నిరుపమాన పాత్ర. కొడుకులకు తనో దారి దీపం. కూతురుకు నాన్నంటేనే పంచప్రాణం. నాన్న లేని ఇల్లు గాఢాంధకారం. చీకట్లను పారద్రోలే రవి కిరణమే నాన్న. కుటుంబ పుస్తకంలో నాన్నే భావాక్షరం. జీవితాక్షరాలకు నాన్నేగా అర్థాలు బోధపరిచే జ్ఞానం. నాన్న పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. తండ్రి త్యాగానికి తత్సమానం లేదు. తండ్రి మది సమస్యల సుడిగుండం. తండ్రి కంటికి కునుకు కరువు. తండ్రి తపన హిమవత్పర్వతం. పురుషుడి జన్మకు సంపూర్ణార్థం నాన్న అవడమే. పిల్లల రెక్కలకు ఎగరడం నేర్పే నైపుణ్య జీవి నాన్న. నవ్వుల పరదాల వెనక బాధలను కప్పేసి, కన్నీళ్లను చెమటగా మార్చి తనవారిని గుండెల్లో పెట్టుకొని సాదుకునే నాన్న హృదయం ఎవరెస్టంత ఉన్నతం, సాగరమంత వైశాల్యం. త్యాగానికి నిలువెత్తు సాక్ష్యం తండ్రి. నాన్న ప్రాధాన్యతను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా జూన్ 3వ ఆదివారం, అనగా 16 జూన్ 2024న 'ప్రపంచ పితృ దినోత్సవం' నిర్వహించుట జరుగుతుంది. మన హిందూ సమాజంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండడంతో అమ్మనాన్నల నేతృత్వంలోనే కుటుంబ ప్రగతి రథం కదులుతుంది. కుటుంబ బండికి రెండు చక్రాలుగా అమ్మానాన్నలు నాయకత్వం వహిస్తారు. పిల్లల బతుకు పయనం ఈ బండిలోనే మొదలవుతుంది. మన సంప్రదాయంలో అనునిత్యం పితృదినోత్సవమే. పాశ్చాత్య దేశాల్లో మాత్రం యవ్వనం ప్రవేశించగానే రెక్కలొచ్చిన బిడ్డలు గూటి నుంచి నిష్క్రమించి స్వతంత్రంగా జీవించడం ప్రారంభిస్తారు. అలాంటి సంస్కృతిలో తండ్రితో కొన్ని క్షణాలు గడపడానికి పితృ దినోత్సవం అనే వేదిక వారికి ఉపయోగపడుతుంది. నేటి భారతీయ యువత ఆధునిక పోకడల పేరుతో అమ్మనాన్నలను ఆదరించకుండా నిర్లక్ష్యం చేస్తూ అనాథలుగా మార్చడం అమానవీయం, ఆక్షేపణీయం. పితృ దినోత్సవం వేదికగా నాన్నకు కృతజ్ఞతలను తెలపడం, పుష్పగుచ్ఛాలను అందించడం, మధుర క్షణాలను సంతోషంగా గడపడం, కానుకలు సమర్పించడం, నాన్న దీవెనలు పొందడం జరుగుతుంది. బాధ్యతల వలలో చిక్కినా, నిబ్బరంగా కనిపిస్తూ, సవాళ్ళను అధిగమిస్తూ, కన్నీళ్లను దిగమింగుతూ, రక్తాన్ని చెమటగా మార్చగల ధన్యజీవి నాన్న. నాన్న రుణం తీర్చుకోలేనిది. నాన్న అయిన తరువాతే పురుషుడికి నాన్న హృదయం ఆవిష్కృతం అవుతుంది. వృద్ధాప్యంలో నాన్న సంతోషానికి కారణం పిల్లల ఉన్నతి. వృద్ధాప్యంలో నాన్నకు మనందరం కృతజ్ఞతాపూర్వకంగా ఊతకర్రలం అవుదాం. తన రుణాన్ని తీర్చుకునే అవకాశాల్ని నిరంతరం చేజిక్కించుకుందాం. మన ముందు కదిలే దేవతలుగా అమ్మనాన్నలను ఆరాదిద్దాం. నాన్న సంతోషానికి కారణమవుతూ, దీవెనలు పొందుతూ, సదా కృతజ్ఞతలు తెలుపుతూ ఉందాం. నాన్నే హీరో, తను లేని జీవితం జీరో. అమ్మనాన్నలు నిర్మించిన హద్దులు లేని ప్రేమ సామ్రాజ్యంలో స్వేచ్ఛగా, బాధ్యతగా ఎగరడం నేర్చుకుందాం, వారి దీవెనలతో శక్తి నింపుకుందాం. తల్లితండ్రులకు పాదాభివందనాలు సమర్పిద్దాం.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరో రెండు పీజీ కోర్సులు మంజూరు

### మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సు ప్రారంభం

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో రూ.2కోట్ల 50లక్షలతో నిర్మించే 12 అదనపు తరగతి గదుల నిర్మాణం వెంటనే చేపట్టాలి: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట:** సిద్దిపేట నియోజకవర్గం లోని ప్రభుత్వ ఆటానమస్ డిగ్రీ కళాశాల లో మరో రెండు పీజీ కోర్స్ లు, అదేవిదంగా మిట్టపల్లి వద్ద ఉన్న మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల లో ఒక పీజీ కోర్సు ప్రారంభం అయినట్లు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ ఆటానమస్ డిగ్రీ కళాశాల లో ఇప్పటికే 10 కోర్సు లతో పీజీ తరగతులు నడుస్తున్నాయి కొత్తగా మరో రెండు కోర్సు లు ఎమ్మెస్సి మైక్రో బయాలాజీ, ఎమ్మెస్సి కంప్యూటర్స్ 60 సిట్ల చొప్పున ఈ సంవత్సరం నుండి ప్రారంభం కానుందని తెలిపారు. అదేవిదంగా మిట్టపల్లి ప్రాంతం లో నడుస్తున్న మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల పీజీ కళాశాల గా అప్గ్రేడ్ తో ఒక పీజీ కోర్సు మంజూరు అయింది.. ఎమ్మెస్సి పిజిక్స్ కోర్స్ ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభం కానుందని చెప్పారు. ఇలాంటి మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతి యువకులని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కొరారు. సిద్దిపేట నియోజకవర్గం విద్యాలయాల నిలయం విరాజిళ్ళుతుంది. రెండు మెడికల్ కాలేజ్ లు, 4 పాలిటెక్నిక్ కళాశాలలు, డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, నర్సింగ్ కళాశాల,ఫార్మసీ కళాశాల, అగ్రికల్చర్ కళాశాల, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలు,



కేంద్రియ విద్యాలయం ఇలా ఎన్నో విద్యాలయాలకు నిలయం గా సిద్దిపేట ఆదర్శం గా నిలుస్తుందన్నారు. సిద్దిపేట యువతి యువకులు, విద్యార్థుల కు మంచి చదువు అందిచాల్లన్నదే నా తపన వారిని విశ్వ విజేతలు గా తీర్చిదిద్దాలన్నదే నా లక్ష్యం అని అన్నారు.

డిగ్రీ కళాశాల లో రూ. 2కోట్ల 50 లక్షలతో నిర్మించే 12 అదనపు తరగతుల గదుల నిర్మాణం వెంటనే చేపట్టాలని సంబందిత అధికారులను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశించారు. పనుల జాప్యం పై ఇటీవల నిర్వహించిన సమిక్ష లో అధికారుల పై హరీష్ రావు అగ్రహం వ్యక్తం చేశారు. వేంటనే పనులు ప్రారంభించాలని కొరారు. సిద్దిపేట నియోజకవర్గం విద్యారంగం లో మరింత పురోభివృద్ధి సాధించేలా అటు విద్యా శాఖ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అందరి సమిష్టి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

# ప్రజలతో మమేకయ్యే శాఖలను తీసుకున్న పవన్

**కాకినాడ:** శాఖల కేటాయింపులో టీడీపీ మిత్రధర్మాన్ని పాటించింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ముఖ్యమైన శాఖలు కేటాయించడంతో పాటు, అదే పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు నాదెండ్ల మనోహర్‌కు కీలకమైన పౌరసరఫరాల శాఖను అప్పగించింది. జనసేనకు సినీరంగంతో ఉన్న సంబంధాలు, పవన్ సినీ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారి విజ్ఞప్తి మేరకు కందుల దుర్గేష్‌కు పర్యాటకం, సినిమాటోగ్రఫీ శాఖను కేటాయించారు. జనసేనానికి హోంశాఖ, ఆర్థిక శాఖలు కేటాయిస్తారని ప్రచారం జరిగినప్పటికీ ప్రజావసరాలు, పార్టీ బలోపేతంపై ద?ష్టిపెట్టిన ఆయన ప్రజలతో మమేకమయ్యే శాఖలనే ఏరికోరి ఎంచుకుని ప్రత్యేకత చాటుకున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు ఉప ముఖ్యమంత్రిగా జనసేత పవన్ కల్యాణ్ ఒక్కరే కొనసాగనున్నారు. జగన్ పాలనలో నలుగురు ఉపముఖ్యమంత్రులు ఉండే వారు. అయితే ఈ సారి పార్టీలో ఎంత మంది సీనియర్లు ఉన్నా జనసేనానిని ఒక్కరినే డిప్యూటీ సీఎంగా నియమించి ఆయన ఎంత స్పెషలో స్పష్టం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ఉపముఖ్యమంత్రి పదవితో పాటు ఆయన కోరుకున్నట్టుగానే కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, పర్యావరణం, శాస్త్రసాంకేతిక శాఖల్ని అప్పగించారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను టీడీపీకి చెందిన సీనియర్ మంత్రికి ఇవ్వాలని మొదట అనుకున్నారు. పవన్ కోరడంతో మిత్రధర్మం ప్రకారం ఆయనకే కేటాయించారు. తనకు ప్రత్యేక గుర్తింపు, సముచిత గౌరవం దక్కేలా తనను మాత్రమే ఉపముఖ్యమంత్రిని చేసి, కీలకశాఖలు ఇస్తే తీసుకోవాలన్న పవన్ అభిమతాన్ని తెలుసుకున్న చంద్రబాబు దానికి తగ్గట్టుగానే ఆయనకు సముచిత ప్రాధాన్యత కల్పించారు. సీఎం తర్వాత ఎక్కువ శాఖలు పవన్ కల్యాణ్ వద్ద ఉండటంతో సచివాలయంలోని అతిపెద్ద చాంబర్ ను ఆయనకు కేటాయించనున్నారు. ఓఎస్డీలు, సెక్రటరీలు, ఇతర అధికారులకు అనుకూలంగా ఉండేలా ఆయన ఛాంబర్ సిద్ధమవుతోంది.2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులున్నా.. ఈ దఫా పవన్ ఒక్కరినే ఉపముఖ్యమంత్రిని చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై పవన్ కల్యాణ్‌కు ఉన్న ప్రత్యేక ఆసక్తి దృష్ట్యా ఆ శాఖను ఏరికోరి తీసుకున్నారు. 'పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటి. ఆ లక్ష్యంలో భాగంగానే అటవీ, పర్యావరణ శాఖను ఆయన ఎంచుకున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.కూటమి అధికారంలోకి రావడంలో పవన్ కల్యాణ్‌దే కీ రోల్.. దీంతో కేబినెట్‌లో జనసేనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు చంద్రబాబు.. కీలకమైన శాఖలను జనసేనకు కేటాయించారు. అందులో



పవన్ కల్యాణ్ స్థాయిని ఏ మాత్రం తగ్గించకుండా డిప్యూటీ సీఎంతో పాటుగా మొత్తం ఆరు శాఖలు ఇచ్చారు. అలాగే జనసేన సీనియర్ నేత, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌కు ప్రాధాన్యత ఉన్నపౌరసరఫరాల శాఖను అప్పగించారు.. జనసేనకు సినీరంగంతో ఉన్న అనుబంధం, పవన్ సినీ నేపధ్యన్ని దృష్టిలో పెట్టుకున్ని ఆ పార్టీ కోరిక మేరకు కందుల దుర్గేష్‌కు పర్యటకం, సినిమాటోగ్రఫీ శాకను కేటాయించారు.వాస్తవానికి పవన్ కల్యాణ్‌కు డిప్యూటీ సీఎంతో పాటు హోం శాఖ ఇస్తారనే ప్రచారం జరిగింది. కీలక శాఖలు తీసుకునే అవకాశం ఉన్నాకూడా పవన్‌కల్యాణే వాటిని తీసుకునేందుకు ఆసక్తి చూపలేరు. ఎందుకంటే హోం, ఆర్థిక శాఖల్లో మంత్రిగా ఉంటే ప్రజలతో ఎక్కువగా ఉండే అవకాశం ఉండదు. అదే పంచాయతీ, గ్రామీణాభివృద్ధి లాంటి శాఖలైతే ప్రజలతో మమేకం అయ్యే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత చేరువ అయ్యే అవకాశం ఈ మంత్రిత్వ శాఖల్లో ఉంటుంది. అందుకే పట్టుబట్టి మరీ పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలను పవన్ తీసుకున్నారు. ఇక పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటవీ శాఖలను కూడా ఆయన అడిగి తీసుకున్నారు.తమ పార్టీని ప్రజల్లోకి ఇంకా బలంగా తీసుకెళ్లేందుకే పవన్ కల్యాణ్ ఈ శాఖలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అందుకే గ్రామీణ ప్రజలతో నేరుగా అనుబంధం కలిగి ఉండే పోర్ట్‌ఫోలియోలనే తీసుకున్నారన్న చర్చ జరుగుతుంది. పాలనలో తన పవర్ ఎలా చూపిస్తారో చూడాలి.

# ఇక స్లీపర్ వందే భారత్

**చెన్నై, జూన్ :** ప్రయాణికులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ ట్రైన్స్ త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. వచ్చే ఆగస్టు 15 నాటికి వందే భారత్ స్లీపర్ ట్రైన్స్ ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే వేగంగా వెళ్లే ఈ రైళ్ల ట్రయల్ రన్ త్వరలోనే చేపడతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు.వందే భారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ ట్రైన్స్ ట్రయల్ రన్ పూర్తి చేసుకుని ఇంకో రెండు నెలల్లో పట్టాలు ఎక్కనున్నాయి. స్లీపర్ల ఏర్పాటుతో మెరుగైన సేవలను అందించనున్నారు. మిగతా రైళ్లతో పోలిస్తే వీటిలో మెరుగైన సౌకర్యాలు ఉంటాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలోనే వందే భారత్ స్లీపర్ ట్రైన్ల ట్రయల్ రన్ పూర్తి చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి . రెండు నెలల్లోనే మొదటి వందే భారత్ స్లీపర్ ట్రైన్ పట్టాలపైకి రానుంది. ఈ రైళ్లను బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ సంస్థ తయారు చేస్తోంది.ఈ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో ట్రైన్‌లను అందిస్తోంది. దాదాపు 200 కి.మీ వేగంతో ప్రయాణించేలా ఈ స్లీపర్ ట్రైన్‌లను రూపొందించినట్లు తెలుస్తోంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ ట్రైన్స్ లలో ఏసీ ఫస్ట్ క్లాస్-1, టూ-టైర్ ఏసీ 4, త్రీ టైర్ ఏసీ 11 కంపార్ట్ మెంట్‌లతో మొత్తం 16 బోగీలతో ఈ రైళ్లను తయారు చేస్తున్నారు.

## దాన గుణాన్ని చాటి చెప్పేది బక్రీద్

**బద్వేలు:** దైవ కోరికతో వెనుకంజ వేయని తండ్రి ఇబ్రహీం ఖలీలుల్లా (అలై) అలాగే భర్త పట్ల విధేయత చాటుకున్న భార్య హాజీరా (రజి) అలాగే తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రాణ త్యాగానికి సిద్ధపడిన హజ్రల్ ఇస్మాయిల్ జెబివుల్లా (అలై) గారి విధేయత, ప్రపంచము అంతం వరకు, రాబోయే ప్రజలకు తెలపడానికి ప్రతీకగా ఈ యొక్క బక్రీద్ పండుగ ముస్లిం సోదరులు జరుపుకుంటున్నారు. రంజాన్ మాంసం తర్వాత దాదాపు రెండు నెలల తర్వాత బక్రీద్ వస్తుంది. ఈ పండగ ముస్లింల రెండో అతి ముఖ్యమైన పండగ.అంతేకాకుండా ఈ పర్వదినం త్యాగాన్ని సూచిస్తుంది. ఈరోజును బక్రా ఈద్, బక్రీద్, ఈద్-అల్ ఆధా, ఈద్ కుర్బాన్ లేదా కార్బన్ బయారామి అని కూడా పిలుస్తారు ఇస్లాంను అనుసరించే వారికి అత్యంత పండుగలో ఒకటై బక్రీద్ లేదా ఈద్ అల్ ఆదాకు ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు. బక్రీద్ పండగ సమాజంలోని వ్యక్తుల్లో దాన గుణాన్ని త్యాగ నిరతిని, పెంపొందిస్తుంది. తమ ఇంటితోపాటు పేదలు, దగ్గర బంధువులు, ఇరుగుపొరుగు వారిని కూడా ఈ సంతోషంలో భాగస్వామ్యం చేయాలని ఉద్బోధిస్తుంది. తమకు కలిగిన దానిలో కొంత దానం చేసి, తాము తినే దానిలో కొంత ఇతరులకు పెట్టాలని చెబుతుంది. అందుకే బక్రీద్ వేడుక రోజున త్యాగ నిరతిని చాటుకుంటూ ఇతరులకు తమ వంతు సహకారాలు అందిస్తారు. బక్రీద్ వేడుక రోజున ఆరుబయట ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు అనంతరం మత పెద్దలు ధార్మిక సందేశాలు ఇస్తారు.

## త్యాగనిరతికి ప్రతీక బక్రీద్: పవన్ కళ్యాణ్

**అమరావతి:** ప్రతీ పండగలోను గొప్ప ధార్మిక సందేశం, విశిష్టత నిబిడీకృతమై ఉంటుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఇస్లాం మతంలో విశ్వాసం ఉన్నవారు రంజాన్ ను ఎంత భక్తి, శ్రద్దలతో జరుపుకొంటారో బక్రీద్ పండుగను కూడా అంతే నిష్టతో చేసుకొంటారు. ప్రవక్త మహ్మద్ త్యాగనిరతిని స్మరించుకుంటూ నిర్వహించుకునే ఈ పండుగ ముస్లింలందరికీ భగవధానుగ్రహం కలుగచేయాలని ఆకాంక్షిస్తున్నాను. ముస్లింలు అతి పవిత్రంగా భావించే హజ్ యాత్ర కూడా ప్రారంభం అయ్యే ఈ శుభ దినాలలో ఆ భగవంతుడు అందరినీ చల్లగా చూడాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు.

## ఎమ్మెల్సీ, జడ్పీ చైర్ పర్సన్ లను కలిసిన జిల్లా వైద్యాధికారి

**జగిత్యాల:** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సమియోద్దీన్ సోమవారం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత- సురేష్ లను వేరువేరుగా జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎమ్మెల్సీకి, జడ్పీ చైర్ పర్సన్ కి పూల బొకే అందించగా జీవన్ రెడ్డి,దావా వసంత వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల దృష్ట్యా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంట, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎన్. శ్రీనివాస్ ఉన్నారు.

## చిన్నారి పై హత్యాచారం చాలా దురదృష్టకరం: మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

**సుల్తానాబాద్:** ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడి ఆపై హత్య ఘటన దురదృష్టకరమని రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్కలు స్పష్టం చేశారు. ఆదివారం రోజున పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని రైస్ మిల్లులో ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారిపై బీహార్ కు చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడడంతో పాటు కిరాతకంగా హత్య చేయడం సభ్య సమాజం క్షమించదన్నారు.తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం జరపడంతో పాటు హత్య చేయడం అతి కిరాతకమని అన్నారు. సంఘటన సమాచారం అందగానే పోలీసులు స్పందించి గంట వ్యవధిలోని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని, అయితే అప్పటికే చిన్నారి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. సంఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నిందితుడిని వెంటనే పట్టుకోవడంతో పాటు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపేలా ఆదేశించారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తాడేపల్లి వాసులకు ఆంక్షల నుండి విముక్తి

**తాడేపల్లి:** మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం పరిసర ప్రాంతాల్లో భారీ కెడ్ల తో, ఇనుప కంచెలతో మూసివేసిన రోడ్లకు విముక్తి కలిగింది. పోలీస్ ఆంక్షలుతో జగన్ నివాస సమీపంలో పరిసర ప్రాంత ప్రజలు రాకపోకులకు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. నారా లోకేష్ మంత్రి అయ్యాక ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చొరవ తీసుకున్నారు. స్థానిక ప్రజలు నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

==========================

## గంజాయిపై ఉక్కుపాదం

**మంగళగిరి:** గంజాయి విషయంలో కఠినంగా వ్యవహరించామని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ అన్నారు.మంగళగిరితో పాటు రాష్ట్రంలో 100 రోజుల్లో గంజాయిని నిర్మూలించమని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నా చర్యలు తప్పవన్నారు.

==========================

## టీడీపీ కార్యకర్త హత్య

**తాడిపత్రి:** అనంతపురం జిల్లా తాడిపత్రి నందలపాడు లో దారుణం చోటు చేసుకుంది. ఇంటిపై నిద్రిస్తున్న టీడీపీ కార్యకర్త లాలు భాషను గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. తాడిపత్రి నందలపాడు లో మెకానిక్ షాపులో పనిచేస్తున్న లాలు భాష తన ఇంటి పై నిద్రిస్తూ ఉండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది.లాలు భాష గతంలో కొన్ని కేసులలో నిందితుడుగా ఉన్నారు. పాత కక్షలు కారణంగా హత్య జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు పోలీసులు. తాడిపత్రి డీఎస్పీ జనార్దన్ నాయుడు, పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని తండ్రి మహబూబ్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

==========================

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నెల్లూరు:** నెల్లూరు జిల్లా కోవూరు సమీప జాతీయ రహదారిపై కారులో వెళ్తున్న ఓ కుటుంబం ప్రమాదానికి గురైంది. ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి లారీని, డివైడర్ ని ఢీకొంది. ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మృతుని భార్య, ఇద్దరి పిల్లలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులు ప్రకాశం జిల్లా గుంటుపల్లికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

==========================

## కీలక విషయాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తాం: ట్రూడో



ఢిల్లీ: కీలక విషయాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తాం, ట్రూడో భారత్,కెనడా సంబంధాలు నామమాత్రంగా ఉన్న సమయంలో ఇరు దేశాల ప్రధానులు కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ మేరకు జీ 7 దేశాల సదస్సు సందర్భంగా ఇటలీలో వీరిద్దరూ భేటీ అయ్యారు. భేటీ అనంతరం కెనడా ప్రధాని జస్టిన్ జస్టిన్ ట్రూడో మాట్లాడుతూ. ముఖ్యమైన అంశాలపై భారత్‌తో కలిసి పనిచేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఇరు దేశాలు కలిసి పనిచేయాల్సిన సున్నితమైన అంశాల జోలికి తాను వెళ్లడం లేదని తెలిపారు.


## మాజీ సీఎం జగన్‌పై ఫిర్యాదు

**తాడేపల్లి:** మాజీ సీఎం జగన్‌కు మరో షాక్ తగిలింది. అతనిపై గుంటూరు ఏఎస్పీ శ్రీనివాసరావుకు బ్రహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం పేరుతో తన సొంత ఇంటికి రూ.46 కోట్ల ప్రజాధనం వినియోగించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన జగన్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## పాస్ బుక్కులు రేషన్ కార్డులు ఉన్న ఉన్న వారికే రుణమాఫీ

**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రూ.2 లక్షల పంట రుణాల మాఫీపై కసరత్తు చేస్తోంది. పంద్రాగస్టులోపు రుణమాఫీ అమలుకు విధివిధానాలు ఖరారు చేయడంలో నిమగ్నమైంది. అయితే పాస్‌బుక్‌లు, రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుని అవి ఉన్న వారికే రుణమాఫీ అమలు చేసేలా తాజాగా ఓ ప్రతిపాదనను అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదాయపన్ను చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయించాలని మంత్రిమండలి సమావేశ ఎజెండాలో ప్రతిపాదించినట్లు తెలిసింది. పంట రుణాల మాఫీపై ఈ వారంలో సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశించడంతో వ్యవసాయాధికారులు రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్న వారి జాబితాను బ్యాంకుల నుంచి తెప్పిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ జాబితా అధికారులకు చేరనుంది. ఈలోపు రుణమాఫీని ఎవరెవరికి అమలు చేయాలనే దానిపై వ్యవసాయశాఖ వివిధ ప్రామాణికాల ప్రాతిపదికన విస్తృతస్థాయిలో అధ్యయనం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# దశ పాప హర దశమి....





దశమి తిథితో సంబంధ పడి మనకు రెండు పెద్ద పండుగలు ముఖ్యమైనవి. ఒకటి జేష్ట శుద్ధ దశమి కాగా, మరొకటి "విజయ దశమి". రెండూ పదిరోజుల పర్యాప్తం అయ్యే పాడ్యమి తిథులతో ప్రారంభమై దశమితో ముగిసే పర్వాలు. జేష్ఠ మాస ఆరంభంలో శుక్ల పక్ష ప్రతిపద నుండి దశమి వరకు "గంగోత్సవాల" పేరుతో, నవరాత్రులు ఆచరించడం, "దశపాప హర దశమి"గా దశమిని అనంతరం "నిర్జల ఏకాదశి" అనుసరించడం సనాతన సంప్రదాయం. జ్యేష్ట శుక్ల దశమి నాడు "గంగావతరణం" జరిగిందని స్మృతి కౌస్తుభం చెబుతున్నది. సోమవారంతో హస్తా నక్షత్రంతో కలసి వచ్చినప్పుడు, "గంగావతరణం" జరిగిందని వాల్మీకి రామాయణం స్పష్టం చేస్తున్నట్లు వ్రతోత్సవ చంద్రిక కారుడు పేర్కొన్నాడు. గంగ దేవలోకంలో "మందాకిని అని, భూలోకంలో నికి "భాగీరథి" అని, పాతాళంలో "భోగవతి"గాను ప్రసిద్ధికెక్కుతుందని బ్రహ్మదేవుడు భగీరథునికి వివరించాడు. అందుకే గంగకు "త్రిపథగ" అనే పేరు వచ్చింది. త్రిపథగ అంటే మూడు లోకాల్లో ప్రవహించేదని అర్థం. భగీరథుడు తన పితృ దేవతల పుణ్య లోకాల ప్రాప్తికై, మొదట బ్రహ్మ ను, తర్వాత శివుని తపస్సుతో మెప్పించిన ఫలితంగా, గంగ బ్రహ్మ ఆదేశానుసారం శివుని జటాజూటంలోనికి వచ్చిపడి, బంధితురాలై, తిరిగి భగీరథుడి అభ్యర్థనపై పరమ శివుడు గంగను హిమాలయ పర్వతాలలో బ్రహ్మదేవుడి చేత నిర్మించ బడిన బిందు సరోవరంలో పడేలా విడిచి పెట్టాడు. నదుల యొక్క మార్గాన్ని నిర్దేశించగల అధికారం ఒక్క బ్రహ్మదేవుడికే "ఉంది. సృష్టి ప్రారంభంలో ఆయనే నది ప్రవాహ మార్గాన్ని నిర్దేశించాడు. బిందు సరోవరం నుండి గంగ ఏడు పాయలుగా చీలి ప్రవహించింది. ఒక పాయ భగీరథుని రథము వెంట పరుగులు తీస్తూ సాగింది. గంగ 7 పాయలుగా విడిపోగా, అందులో మూడుపాయలు తూర్పు దిక్కుకు వెళ్ళి పోయాయి. వాటికి లాధిని, నళిని, పాధిని అని పేర్లు. మూడు పాయలు పశ్చిమ దిక్కుకు వెళ్ళిపోయాయి. అవి సుచక్షువు, సీత, సింధువు అని పిలువ బడుతున్నాయి. మిగిలిన పాయ భగీరథుని వెనుకాల వెళ్ళింది. అదే భాగీరథి. నదులను పూజించే ఆర్యుల ఆచారం నేపథ్యంలోనే "గంగోత్సవం" అనే పేరున నవరాత్రి ఉత్సవాలు "దశహర వ్రతం" పేరున నిర్వహించే ఆచారం అనాదిగా అమలులో ఉంది. గంగా నది నీరు అత్యంత పవిత్రమైంది. ఎన్నాళ్ళు నిలువ వున్నా చెడిపోనిది. అందుకే నిర్మల నదీ జలాలను పూజించి, నదీస్నానం ఆచరించి, షోడశోపచార విధివిధాన అర్చనలు, నిత్య కర్మాను ష్టానాలను, దానధర్మాలను, నది వద్ద నిర్వహించడం, సనాతన వారసత్వం ఆచరణగా మారింది. గంగా తీరం క్షేత్రాలైన కాశీ, హరిద్వార్, నాసిక్, మథుర, ప్రయాగ, నదీ తీరాలలో ఉత్సవం బాగా ఆచరిస్తారు. అక్కడక్కడ గంగాదేవి ఆలయాలు కూడా దర్శనమిస్తాయి. గంగోత్సవానికి మరో పేరు... "దశపాపహర దశమి" లేదా "దశహర దశమి". పది పాపాలను హరించేది అని అర్థం. లింగం దశాశ్వమేధేశం, దృష్ట్వా దశహరా తిథి, దశ జన్మార్జితై: పాపై:, త్యజ్యతే నాత్ర సంశయః".... దశహర తిథి నాడు దశాశ్వమేధ ఘట్టం లోని లింగమును చూసినట్టయితే లోగడ పది జన్మలలో చేసిన పాపం నిస్సందేహంగా నశించి పోతుంది" అని తాత్పర్యం. ఈనాటి సంకల్పంలో "మమ ఏతజ్జన్మ జన్మాంతర సముధ్భూత దశవిధ పాప క్షయ ద్వారా పరమేశ్వర ప్రీత్యర్థం దశహర పర్వ నిమిత్తం స్నాన మహం కరిష్యే" అని ఆచరిస్తారు. జన్మ జన్మాంతరాల నుండి వచ్చిన పది విధాల పాపాలు పోగొట్టే స్నానమని భావము. జేష్ఠ శుక్ల పాడ్యమి నుండి దశమి వరకు అనుదినం స్త్రీలు పిండి వంటలు చేసి, ప్రతిరోజు పదేసి భక్షాలు, దక్షిణ యుతంగా గురువులకు సమర్పించి, పదకొండవ రోజు "నిర్జలైకాదశి" నాడు పచ్చి మంచి నీళ్ళు అయినా ముట్టకుండా ఉపవాసం ఉండటం, అనాదిగా ఆచరణలో ఉన్న సంప్రదాయం. మొగలాయి చక్రవర్తుల కాలాన "జగన్నాథ పండిత రాయలు" అనే ఆంధ్ర ప్రాంత సంస్కృత బ్రాహ్మణ కవి, ఒక " మహమ్మదీయ స్త్రీని వివాహమాడిన క్రమంలో, సనాతనులు సంఘ బహిష్కృతులు కాగా, తన మరియు తన భార్య పాతివ్రత్యంను నిరూపించేందుకు కాశీ వెళ్లి పండితులతో వాదించినా ఫలితం లేక, 52 మెట్లున్న ఒక రేవులో రెండో మెట్టు పై కూర్చొని 52 స్తోత్రం శ్లోకాలు చెప్పగా ఒక్కో శ్లోక పఠనానికి, గంగా నది ఒక్కో మెట్టు పైకి వచ్చి చివరి శ్లోకంతో పండిత రాయలను ముంచేసిందని, తద్వారా పవిత్రతను చాటి చెప్పారని కథనాలున్నాయి. నదులను పూజించే ఆచారం ఆర్యులను బట్టి ఏర్పడినా, ఈ రూపేణా ఒక ఆంధ్ర సంస్కృత కవి, ఉత్తర హిందూ దేశంలో పూజితుడు కావడం ప్రత్యేకం. దక్షిణాదిన దశ పాప హర దశమి పర్వం సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి స్వామి యతి వారి పూజకు ప్రత్యేకించ బడడం విశేషం. వైశాఖ మాసం అంతా సదాశివ బ్రహ్మేంద్ర స్వామి వెరూరు గ్రామం చేరి "నేను జేష్ఠ శుద్ధ దశమి నాడు జీవితం సాధిస్తాను. ఆ రోజున కాశీ నుండి ఒక బ్రాహ్మణుడు ఒక లింగాన్ని తెస్తాడు. నా సమాధి సమీపంలో ఒక ఆలయం కట్టించి, లింగ ప్రతిష్ట చేయండి" అని చెప్పినట్లు కథనం. దశమి నాడు ఆయన ఆదేశానుసారం తవ్వబడిన గోతిలో, స్వామి ఉపవిష్టుడు కాగా, ఆయన శిరస్సు నుండి ఒక దివ్యతేజం లేచి, ఆకాశం వైపుగా పోయి అదృశ్యమైంది. అదే సమయంలో బ్రాహ్మణుడు కాశీ నుండి లింగాన్ని తేవడం జరిగింది. పుదుక్కోట ప్రభువు అక్కడ ఆలయం కట్టించాడు. లింగ ప్రతిష్ట జరిపించాడు.

# ఆదర్శ సంపాదకులు ఖాసా....

గాంధేయవాదానికి, నీతి నియమాలకు నిలువెత్తు దర్పణంగా, బతికిన ప్రముఖ పత్రికా సంపాదకుడు ఖాసా సుబ్బారావు.నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో యాజ్ఞవల్క్య బ్రాహ్మణ (ప్రథమశాఖ) సామాన్య మధ్యతరగతి కుటుంబంలో రామాబాయమ్మ, సుందర రామారావు దంపతులకు 1896, జనవరి 23న జన్మించారు. ఖాసా హైస్కూలు విద్య నెల్లూరులో పూర్తి చేసి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుండి ఫిలాసఫీ ప్రధాన విషయంగా డిగ్రీ పుచ్చుకున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మద్రాసు కాలేజీలో వీరికి గురువు. ఈయనపై డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనల ప్రభావం జీవితాంతం ఉంది. డిగ్రీ పూర్తి అయిన తరువాత న్యాయ శాస్త్రంలో పట్టా సంపాదించారు. కానీ కారణాంతరాల వల్ల న్యాయవాద వృత్తి చేపట్టలేదు. పూర్వీకులు మహారాష్ట్ర ప్రాంతం నుండి నెల్లూరుకు వలసవచ్చారు. భార్య భవానిబాయి, తల్లి రామాబాయంమ్మ లతో కలిసి నెల్లూరు జిల్లా పల్లిపాడులో గాంధీజీ ప్రారంభించిన పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఉన్నారు. చతుర్వేదుల వెంకటకృష్ణయ్య, దిగుమర్తి హనుమంతరావు, బుచ్చిక్రిష్ణమ్మ, కొండిపర్తి పున్నయ్య తదితర ఆశ్రమ వాసులతో కలిసి సత్యం, అహింస, బ్రహ్మచర్యం మొదలయిన 11 సూత్రాలను ఆచరిస్తూ, నిర్మాణకార్యక్రమంలో పాల్గొన్నారు. రాజమండ్రి వెళ్లి ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. నెల్లూరు జిల్లా కందుకూరు జిల్లా బోర్డు మాధ్యమిక పాఠశాల ప్రధానోపాద్యాయ పదవిలో కొంతకాలం పనిచేశాడు. ఈ ఉద్యోగం అతనికి సంతృప్తిని ఇవ్వలేదు. రాత్రి వేళల్లో స్కూలు సమీపంలో ఉన్న 50 మంది వయోజనులకు చదువు చెప్పి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాడు. స్వాతంత్ర్యోద్యమ క్రమంలో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమ సందర్భంలో ఖాసా సుబ్బారావు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, సత్యాగ్రహ లక్ష్యాలను ప్రజలకు వివరించడానికి అనేక చోట్ల విస్తృతంగా పర్యటించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఈయన 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1931లో మద్రాసు చైనా బజారులో విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు పోలీసు లాఠీ దెబ్బలు తగిలి తీవ్ర రక్తస్రావం జరిగి మూర్ఛ పోయారు. ఈ సంఘటన బ్రిటీష్ పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించింది. ఆ సంఘటనపై విచారణ జరిపిన ఏక సభ్య కమిషన్ లార్డ్ లూథియన్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాసా సుబ్బారావును పరామర్శించి లాఠీచార్జ్ ను తీవ్రంగా ఖండించింది. 1942-44ల మధ్య ఈయన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 20 నెలల కారాగార వాసం అనుభవించారు.మద్రాసు ప్రెసిడెన్సీలో నివసించే ఆంధ్రులు వివక్షకు గురయ్యే వారని టంగుటూరి ప్రకాశం భావించి మద్రాసాంధ్రులకు బాసటగా స్వరాజ్య పత్రికను స్థాపించి నడిపారు. ఉపాధ్యాయ వృత్తి తర్వాత 1921లో ఖాసా సుబ్బారావు మద్రాసుకు వెళ్ళి, ఓసారి జాతీయ భావాల ప్రచార కార్యక్రమంలో భాగంగా మద్రాసులోని స్వరాజ్య పత్రిక కార్యాలయానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు ఖాసా లోని దేశభక్తిని గమనించి తన బదులు స్వరాజ్య పత్రికలో సంపాదకీయం రాయడానికి సుబ్బారావును కోరారు. అది మొదలు సుబ్బారావు పత్రికా లోకంలో తన వైభవాన్ని విశేషంగా చాటు కున్నారు. భాష, భావ వ్యక్తీకరణ, స్పష్టత, నిర్భీతి లాంటి గుణాల వల్ల సుబ్బారావును పాఠక లోకం విశేషంగా అభిమానించింది. అప్పటి నుండి ఖాసాకు పత్రికా రంగంతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది.అలా ఖాసా సుబ్బారావు చివరకు జర్నలిజం లోనే స్థిరపడి పోయారు. ఈ పత్రికకు ప్రకాశం పంతులు మేనేజింగ్ డైరెక్టర్‌గా, సంపాదకుడిగా వ్యవహరించాడు. కె.ఎం.ఫణిక్కర్ ఇన్‌ఛార్జ్ ఎడిటర్‌గా వ్యవహరించేవారు. ఖాసా సుబ్బారావుతో పాటు ఎన్.ఎన్.వరదాచారి, కోలవెన్ను రామకోటేశ్వర రావు, ఎం.చలపతిరావు మొదలైన వారు ఈ పత్రిక ఉప సంపాదకులుగా వ్యవహరించారు. జాతీయ భావాలు అధికంగా ఉన్న ఖాసాను ప్రకాశం పంతులు ఏరికోరి తన పత్రిక సంపాదకునిగా నియమించు కున్నారు. రాజాజీతో పాటు పలువురు రాజకీయ ఉద్దండులు ఆయన కలంపోటుకు గురయ్యారు. అయినప్పటికీ అందరూ ఆయన్ను ఎంతో గౌరవించే వారు. అభిమానించే వారు. టంగుటూరి ప్రకాశం ఈ పత్రికలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించలేక పోతే ఖాసా కార్మికుల పక్షాన నిలిచారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రకాశంకు ఘాటైన లేఖలు వ్రాసేవారు. ఆర్థిక సంక్షోభం వల్ల ఈ పత్రిక మూతబడింది. 1936 వరకు స్వరాజ్యలో పనిచేసిన ఖాసా అనంతరం కోల్‌కతా నుండి వెలువడే ఇండియన్ ఫైనాన్స్, ముంబాయి నుండి వెలువడే ఫ్రీ ప్రెస్ జర్నల్‌లో పని చేశారు. ఆ తరువాత ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాయింట్ ఎడిటర్‌గా, ఎడిటర్‌గా పనిచేశారు. ఆంధ్రప్రభకు తొలి సంపాదకులు ఆయనే. స్వతంత్ర భావాలు కలిగిన ఖాసా ఇతర పత్రికలలో ఇమడలేక స్వంతంగా పత్రికను ప్రారంభించారు. తన మిత్రుడు ఉప్పులూరి కాళిదాసు సహకారంతో 1946లో స్వతంత్ర అనే ఆంగ్ల వార పత్రికను ప్రారంభించారు. 1948లో తెలుగు స్వతంత్రను ప్రారంభించారు. ఈ రెండు వార పత్రికలను పదేళ్ల పాటు బలమైన రాజకీయ వార్తా పత్రికలుగా నడిపారు. ఈ సంఘటన బ్రిటీష్ పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించింది. ఆ సంఘటనపై విచారణ జరిపిన ఏక సభ్య కమిషన్ లార్డ్ లూథియన్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాసా సుబ్బారావును పరామర్శించి లాఠీచార్జ్ ను తీవ్రంగా ఖండించింది. 1942-44ల మధ్య ఈయన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 20 నెలల కారాగార వాసం అనుభవించారు.మద్రాసు ప్రెసిడెన్సీలో నివసించే ఆంధ్రులు వివక్షకు గురయ్యే వారని టంగుటూరి ప్రకాశం భావించి మద్రాసాంధ్రులకు బాసటగా స్వరాజ్య పత్రికను స్థాపించి నడిపారు. తెలుగు స్వతంత్రలో చాలా అపురూపమైన సాహిత్యం చోటు చేసుకుంది. ఆ రచనలకు పారితోషికం ఇచ్చే సంప్రదాయం తొలినాళ్ళలో లేకున్నా అప్పటికి ఔత్సాహిక రచయిత అయిన భరాగో ఉత్తరంలో కోరడంతో సరిదిద్దుకుని ఆపైన రచనలకు పారితోషికం ఇచ్చే సంప్రదాయం ప్రారంభించారు.

## తెలుగు రేడియో తొలి ప్రవక్త!




ఆచంట జానకిరాం సుప్రసిద్ధ రేడియో ప్రసార ప్రముఖులు, రచయిత. చిత్రకారులు.జానకిరామ్ 1903 జూన్ 16న జన్మించారు. ఆయన సుప్రసిద్ధ సంఘ సేవకురాలు, ఆచంట సీతమ్మ, వైద్యులు ఆచంట లక్ష్మీపతి కుమారులు. ఆయన బాల్యం అంతా మద్రాసులో గడిచింది, అడయార్ లో మొదటి యుద్ధం రోజుల్లో కొంత కాలం మదనపల్లిలో విద్యాభ్యాసం. ఆ రోజుల్లోనే అక్కడ స్కూల్ ప్రిన్సిపాల్ గా ఉన్న జేంసు కజిన్సు శిష్యరికం. కజిన్సు జానకిరామ్‌కి చిత్ర కళలో అభిరుచి కల్పించారు. వారి సాంగత్యంలో తనెన్నో విషయాలు నేర్చుకున్నానని జానకిరామ్ తెలియజేశారు. ఆయనకు దువ్వూరి రామిరెడ్డి, అడవి బాపిరాజు లను పరిచయం చేసింది కూడా కజిన్సే. ఆ రోజుల్లోనే హోమ్ రూల్ నాయకులు అనీ బిసెంట్ అరండేల్ ల ప్రభావం పడింది. మదనపల్లి లో ఉండగానే అక్కడికి వచ్చిన రవీంద్రుడ్ని దగ్గరగా చూసే భాగ్యం కలిగింది. తండ్రి ఆచంట లక్ష్మీపతి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, సంఘ సంస్కర్త. వారి పెంపకంలో జానకిరామ్‌కి ఉత్తమ సంస్కారం పుణికి పుచ్చుకున్నారు. రాజకీయ, సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న కుటుంబం అవటం వల్ల ఆ ప్రభావాలన్నీ ఆయన మీద ఉన్నాయి. చిన్నప్పట్నించీ సమకాలిక మహావ్యక్తుల పరిచయ భాగ్యం లభించింది. వీరేశలింగం, గురజాడ, ఉన్నవ లాంటి సంస్కర్తలు, రచయితలు తన తండ్రితో ఇష్టాగోష్టి జరుపు తున్నప్పుడు వినే అదృష్టం కలిగింది. అడయార్ లో బి. ఎస్సీ. అయ్యాక వారు కొంత కాలం విజయనగరం లో, బెంగుళూరు ఇండియన్ ఇంస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ లో రసాయన శాస్త్ర పరిశోధనలు చేశారు. బెంగుళూరు పరిశోధనా జీవితం తర్వాత ఇన్స్యూరెన్సు కంపెనీ కార్యదర్శిగా బెజవాడ కేంద్రంగా పని చేశారు. ఆ రోజుల్లోనే ఆయనకు ఆంధ్ర ప్రదేశ్ లోని కవి పండితులందరితో పరిచయం, స్నేహం పెరిగాయి. ఉద్దండుల్కైన కవులు, గాయకులు, తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, అన్ని రంగాల్లోని నిష్ణాతులతో మైత్రి ఏర్పడ్డమే కాక వారి ప్రేమానురాగాలు పొందారు.

# దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా మరోసారి రమఫోసా....



దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా సిరిల్ రమాఫోసా మరోసారి ఎన్నికవ్వడానికి రంగం సిద్ధమైంది. అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ), ప్రతిపక్ష పార్టీల మధ్య జరిగిన సంకీర్ణ ఒప్పందం తరువాత ఆయనను ప్రెసిడెంట్‌గా ఎన్నుకునే చాన్స్ ఉంది. సంకీర్ణ ప్రభుత్వానికి దేశంలో రెండో అతి పెద్ద పార్టీ అయిన డెమొక్రటిక్ అలయన్స్ (డీఏ) మద్దతిచ్చింది. ఆఫ్రికాలోని అత్యంత పారిశ్రామిక దేశాన్ని సహ-పరిపాలన చేసేందుకు ఏఎన్‌సీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ పార్టీ నేత జాన్ స్టీన్ హుసేన్ తెలిపారు. ఎక్కువ సీట్లు గెలిచినందున రమఫోసా అధ్యక్షుడిగా ఉంటాడని వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని స్వాగతించిన రమాఫోసా.. సంకీర్ణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి రావడం ఆనందంగా ఉందన్నారు. కాగా, వర్ణ వివక్ష నుంచి 1994లో దక్షిణాఫ్రికా విముక్తి పొందిన తర్వాత వరుసగా ముప్పయ్యేళ్లపాటు ఏఎన్‌సీ పార్టీ అధికారంలో కొనసాగింది. కానీ గత నెలలో జరిగిన జాతీయ ఎన్నికల్లో మొదటి సారి మెజారిటీ కోల్పోయింది. ఏఎన్ సీకి 40 శాతం ఓట్లు రాగా, డీఏకు 22శాతం ఓట్లు వచ్చాయి.

# రాజ్ మహల్ ప్యాలెస్ తరహా నిర్మాణం

## - రుషికొండలో ఇంటిని చూపించిన గంటా



**విశాఖపట్టణం:** రుషికొండపై అత్యంత రహస్యంగా నిబంధనలకు విరుద్ధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజ భవనాన్ని తలపించే నిర్మాణాన్ని చేపట్టారని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అత్యంత రహస్యంగా రూ.500 కోట్లు వెచ్చించి రాజమహల్ తరహాలో భవనాన్ని జగన్మోహన్ రెడ్డి నిర్మించారన్నారు. ఈ భవన నిర్మాణానికి సంబంధించిన మొత్తం సైటు 61 ఎకరాలు కాగా, 9.8 ఎకరాల్లో భవనాన్ని రూ.500 కోట్లు రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించారన్నారు. ఏడు బ్లాకుల్లో సాగిన నిర్మాణాలకు ఒక్కో పేరు పెట్టారని గంటా వెల్లడించారు. పూర్వీకులు కాలంలో, సద్దాం హుస్సేన్, గాలి జనార్దన్ రెడ్డి వంటి వారు నిర్మించుకున్న తరహాలో జగన్మోహన్ రెడ్డి ఈ భవన నిర్మాణాలను చేపట్టారని, దీన్ని హోటల్ గా వినియోగించుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారని గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ భవనాన్ని ఎలా వినియోగించుకోవాలన్న దానిపై సీఎం చంద్రబాబుతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. హోటల్ మాదిరిగా వినియోగించుకునేందుకు అవకాశం లేకుండా భవన నిర్మాణం చేపట్టారని, రివ్యూలు, సమీక్షలు నిర్వహించేందుకు అనుగుణంగా ఈ భవన నిర్మాణం ఉందన్నారు. ఒక్కో హాల్ ను అత్యంత విశాలంగా నిర్మించారన్న గంటా.. అత్యంత వివాదాస్పదంగా, అత్యంత రహస్యంగా నిర్మాణం ఎందుకు చేశారో అని ప్రశ్నించారు. ఎంతో ఇష్టపడి నిర్మించుకున్న భవనంలోకి అడుగు కూడా పెట్టకుండా జగన్మోహన్ రెడ్డి దిగిపోవాల్సి వచ్చిందని ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలచింది అన్నట్టుగా.. జగన్మోహన్ రెడ్డి అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకుని తన కలల సౌదంలోకి అడుగుపెట్టకుండానే వెళ్ళిపోవాల్సి వచ్చిందని విమర్శించారు. 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన యువకుడు ప్రజా తీర్పును అపహాస్యం చేస్తూ పాలన సాగించడం వల్లే 2024 ఎన్నికల్లో ఘోరమైన ఓటమిని చవి చూడాల్సి వచ్చిందన్నారు. జగన్మోహన్ రెడ్డి నిరంకుశమైన విధానాలు, పాలనలో అడ్డగోలు నిర్ణయాల వల్ల రాజధానిగా చేస్తామన్న విశాఖ ప్రాంతంలో కూడా ఆ పార్టీ నాయకులు ఘోరమైన ఓటమిని చవిచూసారన్నారు. దీని ద్వారా ఇక్కడి ప్రజలు విశాఖ రాజధాని వద్దన్న సంకేతాలను జగన్మోహన్ రెడ్డికి ఇచ్చారని, ఈ విషయాన్ని ఇప్పటికైనా ఆయన గుర్తించాలని సూచించారు. ఓటమికి గల కారణాలను సమీక్షించకుండా.. ప్రజలపై నిందలు వేసేలా మాట్లాడుతున్న ఆయన తీరు చూస్తుంటే జగన్మోహన్ రెడ్డిలో ఇంకా మార్పు వచ్చినట్లు కనిపించడం లేదన్నారు. వైసిపి మునిగిపోతున్న పడవ అని తాను ఎప్పుడో చెప్పానని, తాజా ఎన్నికల్లో అది నిరూపితమైందన్నారు. ఋషికొండపై హరిత రిసార్ట్స్ ఉండేవని, వీటి ద్వారా ఏడాదికి ఎనిమిది కోట్లకుపైగా ఆదాయం వచ్చేదని గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నిర్మాణాలను కూలదోసి, రుషికొండపై ఉన్న పచ్చదనాన్ని నాశనం చేసి నిబంధనలకు విరుద్ధంగా ఈ భవనాన్ని నిర్మించారని గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఈ నిర్మాణానికి సంబంధించి చెప్పిన విషయాలు కూడా అబద్ధాలుగా నిరూపితమయ్యాయని, తొలుత స్టార్ హోటల్ అని, ఆ తరువాత ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ అని, ఆ తర్వాత టూరిజం ప్రాజెక్టుగా చెప్పారని విమర్శించారు. నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేట్లను కూడా గోప్యంగా ఉంచారని ఆరోపించారు. ప్రజా వేదికను కూల్చినప్పుడు జగన్ మోహన్ రెడ్డి అక్రమ కట్టడం అని పేర్కొన్నారని, రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఈ కట్టడాన్ని ఏమంటారో కూడా ఆయన చెప్పాలని గంటా ప్రశ్నించారు. ఈ నిర్మాణంపై పలువురు టిడిపి నాయకులు కోర్టుకు వెళితే కోర్టును కూడా బురిడీ కొట్టించేలా వ్యవహరించారని విమర్శించారు.

అత్యంత ఇష్టంతో కట్టుకున్న ఈ భవనాన్ని కనీసం చూడడానికి కూడా జగన్మోహన్ రెడ్డి రాలేని పరిస్థితి ఏర్పడిందని, ఆఖరికి టూరిజం మినిస్టర్ వచ్చి మూడో కంటికి తెలియకుండా ప్రారంభోత్సవం చేసి వెళ్లిపోయారని గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. మూర్ఖుడు రాజు కన్నా బలవంతుడని, అటువంటి మూర్ఖుడు రాజు అయితే ఎలా ఉంటుందో జగన్మోహన్ రెడ్డి పాలన చూస్తే అర్థమవుతుందని గంటా శ్రీనివాసరావు విమర్శించారు. లాజిక్, పద్ధతి లేని పాలన చేసిన జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలోనే పతనాన్ని చూశారన్నారు.

# సిక్కింలో కొనసాగుతోన్న భారీ వర్షాల బీభత్సం..!

సిక్కిం : సిక్కింలో భారీ వర్షాల బీభత్సం ఇంకా కొనసాగుతూనే ఉంది. భారీ వర్షాల ధాటికి పెద్ద ఎత్తున వరదలు పోటెత్తుతున్నాయి. ఈ వరదల ప్రభావిత ప్రాంతాల్లో 1200 మందికి పైగా స్వదేశీ, విదేశీ పర్యాటకులు చిక్కుకుపోయారు. విద్యుత్ స్తంభాలు కూడా వరదల్లో కొట్టుకుపోవడంతో అంధకారంలో గడుపుతున్నారు.

నెట్ వర్క్ లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. రోడ్లన్నీ రాళ్ళతో బండ్లతో మూసుకుపోవడం వల్ల రాకపోకలు ఎక్కడికక్కడ స్తంభించాయి. ఆ రోడ్ల మరమ్మతులకు కనీసం 5 నుండి 6 రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలించిన తర్వాత పర్యాటకులను ఇక్కడి నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు.



అయితే సిక్కిం రాష్ట్రంలో చిక్కుకుపోయిన పర్యాటకులను ప్రత్యేక విమానంలో తరలించడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు సిక్కిం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయ్ భూషణ్ పాఠక్ వెల్లడించారు.

# బలపడుతున్న హైబ్రిడ్ నియంతృత్వం!




**త్రిస్సూర్ :** ప్రజాస్వామ్య ముసుగులో అంతర్గత నియంతృత్వంతో కూడిన హైబ్రిడ్ నియంతృత్వం భారతదేశంలో బలపడుతున్నదని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ అన్నారు. ఈఎంఎస్ నంబూద్రిపాద్ 115వ జయంతి సందర్భంగా కేరళలో ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో 'భారతదేశంలో ప్రజాస్వామ్యం - నియంతృత్వం' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. బృందా కరత్ మాట్లాడుతూ.. ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే విధానం అన్నది బీజేపీ ప్రభుత్వ వైఖరి అని ఆమె తెలిపారు. పార్లమెంటును అదుపులో ఉంచడం ద్వారా కార్పొరేట్ల ప్రయోజనాలను కొనసాగించడానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య సంస్థలను అంచెలంచెలుగా నాశనం చేసే ధోరణి ఇదని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ కాలంలో ఉపా (యూఏపీఏ) కేసుల సంఖ్య 72 శాతం పెరిగిందని ఆగ్రహించారు.

# శిల్పా శెట్టి- రాజ్ కుంద్ర దంపతులపై చీటింగ్ కేసు



**ముంబయి :** బాలీవుడ్ హీరోయిన్ శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రపై చీటింగ్ కేసు నమోదుకు ముంబయి కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఈ దంపతులపై బిట్ కాయిన్ ఫ్రాడ్, మనీలాండరింగ్ వంటి కేసులు నమోదయిన సంగతి విదితమే. గత నవంబర్ 2022లో పోర్నోగ్రఫీ కేసులో రాజ్ కుంద్ర జైలు శిక్ష అనుభవించారు. తాజాగా %'% గోల్డ్ స్కీమ్ (బోగస్ బంగారం పథకం)తో శిల్పా రాజ్ కుంద్ర తమను మోసం చేశారంటూ ఓ వ్యాపారవేత్త కోర్టును ఆశ్రయించారు. వారు స్థాపించిన సత్‌యుగ్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తాను మోసపోయాయని, శిల్పా శెట్టి దంపతులపై చర్యలు తీసుకోవాలని సదరు వ్యాపారి కోరారు. శిల్పాశెట్టి-కుంద్రా దంపతులు, వారు స్థాపించిన సత్‌యుగ్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, దాని ఇద్దరు డైరెక్టర్లు, ఒక ఉద్యోగి కలిసి మోసానికి పాల్పడినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నట్లు జడ్జి ధ్రువీకరించారు. వ్యాపారి చేసిన ఫిర్యాదుపై స్పందించిన ముంబయి అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఎన్‌పి మెహతా.. శిల్పా శెట్టి దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కేసులో పూర్తి స్థాయిలో విచారణ జరపాలని జడ్జి పేర్కొన్నారు.

# ఎన్డీయే ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదు

పొరపాటున ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వం ఎప్పుడైనా పడిపోవచ్చని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. బీజేపీ తన పొత్తులను కొనసాగించడానికి చాలా కష్టపడుతుందని తెలిపారు. శనివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. 'ఎన్డీయే ప్రభుత్వం అనుకోకుండా ఏర్పడింది. మోడీకి మెజారిటీ లేదు. ఇది మైనారిటీ ప్రభుత్వం. కాబట్టి ఎప్పుడైనా పడిపోవచ్చు. కానీ నేను ఇది కొనసాగాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించారు. దేశాన్ని బలోపేతం చేయడానికి కలిసి పని చేయాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. దేశాభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తామని చెప్పారు. బీజేపీ మిత్ర పక్షాలు ఇప్పటికే అసంతృప్తితో ఉన్నాయని, కేంద్ర కేబినెట్ ఏర్పాటు తర్వాత ఈ విషయం స్పష్టంగా అర్థమైందన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై జేడీయూ నేత నీరజ్ కుమార్ స్పందించారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ హయాంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల పనితీరు గురించి ఖర్గేకు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ1991 సాధారణ




ఎన్నికల్లో 244 సీట్లు, 2004లో 114 సీట్లు మాత్రమే గెలుచుకుందని తెలిపారు. కాంగ్రెస్ చరిత్ర గురించి ఖర్గేకు తెలియదా అని ప్రశ్నించారు. మరోవైపు నీరజ్ వ్యాఖ్యలకు ఆర్జేడీ కౌంటర్ ఇచ్చింది. ఖర్గే చెప్పింది నిజమేనని ప్రజలంతా మోడీకి వ్యతిరేకంగానే ఉన్నారని తెలిపారు. ఓటర్లు అంగీకరించకున్నా మోడీ అధికారంలోకి వచ్చాడని ఆర్జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ చెప్పారు.

# పెరగని మహిళా ప్రాతినిధ్యం....!


మహిళలను జాతి నిర్మాతలుగా మలచడానికి, నారీ శక్తిని గౌరవించడానికి ప్రధాని మోడీ పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో ఆమోదించారని, గత ఏడాది సామాజిక మాధ్యమాల్లో హోరెత్తిపోయే ప్రచారం జరిగింది. పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం పార్లమెంటు, శాసనసభ ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అనేది 2026లో జాతీయ జనాభా గణన పూర్తయి, పార్లమెంటు స్థానాల పునర్వ్యవస్థీకరణ (డి-లిమిటేషన్) పూర్తయిన పిదప అమలులోకి వస్తుంది. అంటే 2029లో మాత్రమే అది అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఏదైనా కారణాల వల్ల ఈ డెడ్‌లైన్ మిస్ అయితే 2034లో జరగబోయే ఎన్నికల వరకు మహిళా రిజర్వేషన్ అమలయ్యే పరిస్థితి లేదని మనం అర్థం చేసుకోవాలి. ఇటీవల జరిగిన 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎప్పటి మాదిరిగానే మహిళా సభ్యుల ప్రాతినిధ్యం తీసికట్టుగానే ఉంది. ఇంకా చెప్పాలంటే తగ్గింది. 74 మంది మహిళలు ఎంపీలుగా ఎన్నికయ్యారు. ఇది మొత్తం పార్లమెంట్ సభ్యుల్లో 13.6 శాతం మాత్రమే. 2019లో 78 మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఇది 14.4 శాతంగా ఉంది. గత ఎన్నికల్లో 726 మంది మహిళలు పోటీ చేయగా, 2024 ఎన్నికల్లో పోటీ చేసినవారి సంఖ్య 797కి పెరిగింది. అయినా ఎన్నికయిన మహిళా పార్లమెంట్ సభ్యుల సంఖ్య తగ్గడం గమనార్హం. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించే విషయం మనకు తెలిసిందే. రాష్ట్రాలలో శాసనసభలకు జరిగే ఎన్నికల సందర్భంగా, మహిళలకు ప్రత్యేకంగా కొన్ని సంక్షేమ పథకాలను కూడా రాజకీయ పార్టీలు ప్రకటిస్తూ ఉంటాయి. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల లాగే, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అనేక పార్టీలు తమ మ్యానిఫెస్టోలలో ప్రత్యేక పథకాలను పొందుపరిచాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిషా ఎన్నికలలో పాలక, ప్రతిపక్ష పార్టీలు మహిళలే కేంద్ర బిందువుగా అనేక పథకాలు తీసుకువచ్చాయి. వీటన్నింటి ప్రభావం ఎన్నికల్లో ఉంటుందని, ఓట్లు వేయడానికి మహిళా ఓటర్లు పోటెత్తుతారని అందరూ భావించారు. కానీ విపరీతమైన ఎండ తీవ్రత, ఓటింగ్ పట్ల నిరాసక్తత వంటి కారణాలతో ఓటింగ్ శాతం తగ్గింది. 2019లో దేశవ్యాప్తంగా 67.01 శాతం పురుషులు ఓట్లేయగా, 67.18 శాతం మహిళలు ఓట్లేశారు. ఈ ఎన్నికలలో 65.08 శాతం పురుషులు ఓట్లేస్తే, 65.78 శాతం మాత్రమే మహిళా ఓటింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల్లో 31 కోట్ల మంది మహిళా ఓటర్లు ఓట్లేసినప్పటికీ, గతంతో పోలిస్తే దాదాపు 2 శాతం మహిళా ఓటింగ్ తక్కువ నమోదవడం గమనార్హం. అస్సాం, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో మాత్రం 80 శాతం పైబడి మహిళా ఓటింగ్ నమోదైంది. 2023లో ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాల్లో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ (ఐపియు) సమాచారం మేరకు ప్రపంచ వ్యాప్తంగా 27.6 శాతం మహిళలు పార్లమెంటు సభ్యులుగా గెలుపొందారు. ఈ విషయంలో 185 ప్రపంచ దేశాల్లో భారత్ స్థానం 143గా ఉంది. ఈ ఏడాది ఎన్నికలు జరగడానికి ముందు మన దేశ పరిస్థితి ఇది. ఈ ఎన్నికల తర్వాత, మన దేశ స్థానం ఇంకా దిగజారే ప్రమాదం ఉంది. ఫిన్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, స్వీడన్ దేశాలు ఎప్పుడో మహిళా సమానత్వాన్ని సాధించాయి. అక్కడి ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు మహిళలే. మన పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యం అంతంత మాత్రంగా ఉంటే, అనేక దేశాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ మధ్యే మెక్సికోలో మొట్టమొదటి సారిగా ఓ మహిళ అధ్యక్ష పీఠానికి ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానం కోసం పోటీ పడిన ఇద్దరు అభ్యర్థులూ మహిళలే కావడం విశేషం. ఇదేదో ఒక రోజులో జరిగింది కాదు. మెక్సికో కూడా లిబరల్ దేశమేమీ కాదు. అక్కడ కూడా ఛాందసవాద శక్తులు, గుత్త పెట్టుబడిదారీ శక్తులు వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని అడ్డుకుంటూనే ఉన్నాయి. అయితే, వీటిపై పురోగామి శక్తులు, ఫెమినిస్టులు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తూనే ఉన్నారు. దాని ఫలితమే ప్రస్తుతం మెక్సికోలో కొన్ని సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయి. మన దేశంలో పార్లమెంటరీ రంగంలోనే కాదు%'%నిర్ణయాత్మక రంగాలలోనూ మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. దేశం అనుకున్న రీతిలో అభివృద్ధి చెందడానికి ఇది ప్రధాన అవరోధంగా ఉంది. 1947లో దేశ మొత్తం అక్షరాస్యత కేవలం 12 శాతం ఉండగా నాడు మహిళల్లో అక్షరాస్యులు 6 శాతం మాత్రమే. ప్రస్తుతం మొత్తం అక్షరాస్యత 77.7 శాతం ఉండగా మహిళలది 70.3 శాతంగా నమోదైంది. పురుషులతో పోలిస్తే మహిళల అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్నప్పటికీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. 1957లో కేరళలో నంబూద్రిపాద్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం భూ సంస్కరణలు అమలు చేసింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం కూడా భారీగా భూ సంస్కరణలు అమలు చేసింది. మిగులు భూమిని పేద ప్రజలకు ఇవ్వబడింది. తినడానికి ఆహారం, చదువుకోవడానికి విద్య ప్రజలకు లభించింది. అందుకే మానవాభివృద్ధిలో మొదటి స్థానం కేరళ రాష్ట్రానిది. 100 శాతం అక్షరాస్యత సాధించబడింది. ఈ నిర్ణయాల వల్ల కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మహిళల స్థితిగతులు గణనీయంగా పెరిగాయి. 1992లో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా మహిళలకు అన్ని స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు. తర్వాత 2002లో పట్టణ స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని మరోసారి సవరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, త్రిపుర, కేరళ రాష్ట్రాల్లో పంచాయతీల్లోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఫలితంగా వారి ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది.

# బెండకాయతో బరువు కూడా తగ్గొచ్చు....!




ఆరోగ్య నిపుణులు ఎల్లప్పుడూ ఆహారంలో ఆకుపచ్చ కూరగాయలను పుష్కలంగా చేర్చుకోవాలని సిఫార్సు చేస్తారు. ఎందుకంటే వాటిని తీసుకోవడం ద్వారా శరీరానికి విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా అందుతాయి. అనేక తీవ్రమైన ఆరోగ్య సంబంధిత సమస్యలు కూడా నయమవుతాయి. అయితే ఊబకాయం సమస్యతో పోరాడుతున్న వ్యక్తులు తమ ఆహారంలో ఏదైనా ఆహారం లేదా పానీయాన్ని చేర్చుకునే ముందు చాలాసార్లు ఆలోచిస్తారు. మీరు కూడా ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నట్లయితే, బరువు తగ్గాలని కోరుకుంటే మీరు మీ ఆహారంలో బెండకాయలను చేర్చుకోవచ్చు. కానీ, స్థూలకాయాన్ని తగ్గించడానికి దీన్ని ఎలా వినియోగించాలో ఇప్పుడు తెలుసుకుందాం. బెండకాయ మీ బరువు తగ్గించే ప్రయాణాన్ని చాలా వరకు సులభతరం చేస్తుందని ఆహార నిపుణులు అంటున్నారు. దీని కోసం మీరు లేడీ ఫింగర్ వాటర్ తీసుకోవాలి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. లేడీస్ ఫింగర్ వాటర్ బరువు తగ్గడంలో మాత్రమే కాకుండా చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో మీరు ఊబకాయం లేదా మధుమేహం విషయంలో దీనిని తీసుకోవచ్చు. బెండకాయలో పీచుపదార్థం ఎక్కువ మొత్తంలో లభిస్తుందని, అందుకే దీనిని తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. ఇది మాత్రమే కాదు బెండకాయ వాటర్ తాగడం కూడా మీ జీర్ణవ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇటువంటి పరిస్థితిలో మీరు తీవ్రమైన కడుపు సంబంధిత సమస్యల నుండి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. లేడీఫింగర్‌ను రెండు సమాన భాగాలుగా కట్ చేసి ఆపై ఒక గిన్నెలో 2 కప్పుల నీటిని పోసి మరుసటి రోజు ఉదయం లేడీఫింగర్‌ను ఈ నీటిలోంచి వేరు చేసి, నీరు త్రాగాలి. ఇది మీ జీవక్రియను పెంచుతుంది. ఇది మీ బరువును తగ్గించడంలో సహాయపడుతుంది.

# పచ్చి అరటికాయతో పుట్టెడు లాభాలు...!




పచ్చి అరటికాయను మీ ఆహారంలో చేర్చుకోవటం వల్ల జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పచ్చి అరటిపండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పచ్చి అరటిపండ్లు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి అంటే అవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచవు. ఇది మధుమేహం ఉన్నవారికి మంచి ఎంపికగా చేస్తుంది. పచ్చి అరటికాయను తరచూ ఆహారంలో చేర్చుకోవటం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పచ్చి అరటిపండ్లు ఫైబర్ అధికంగా, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పచ్చి అరటి కాయ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పచ్చి అరటిపండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికి మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. అరటి పండు లాగే, అరటి కాయ కూడా శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతుంది. పచ్చి అరటిపండ్లు కార్బోహైడ్రేట్లకు మంచి మూలంగా పనిచేస్తుంది. ఇవి శక్తి స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి. చర్మానికి మేలు చేస్తుంది. పచ్చి అరటిపండ్లలో ఉండే విటమిన్ సి చర్మానికి మేలు చేస్తుంది. ఇది చర్మంపై ముడతలు, మొటిమలు, మచ్చలను నివారిస్తుంది. చర్మాన్ని యవ్వనంగా ఉంచటంలో కూడా పచ్చి అరటి కాయ తోడ్పడుతుంది. శక్తి స్థాయిలను పెంచుతుంది. పచ్చి అరటిపండ్లలో ఉండే పొటాషియం శక్తి స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యానికి మంచిది. పచ్చి అరటిపండ్లలో ఉండే మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి మంచిది. అయితే, పచ్చి అరటిపండ్లను అనేక విధాలుగా తినవచ్చు. వాటిని ఉడికించి, వేయించి, పులుసులో వేసి, చిప్స్‌గా కూడా తినవచ్చు. పచ్చి అరటిపండ్లతో చేసిన పిండిని కూడా అనేక వంటకాలలో ఉపయోగించవచ్చు.

# రెండు మిరియాలను నమిలి మింగితే....



మన వంటింట్లో ఉపయోగించే మసాలా దినుసుల్లో అనేక ఔషధ గుణాలు నిండివున్నాయి. ఈ సుగంధ ద్రవ్యాలను ఉపయోగించి అనేక మొండి రోగాలను కూడా నయం చేసుకోవచ్చు. కాకపోతే వాటిని ఎలా ఉపయోగించాలనేది తెలిసుండాలి. అలాంటి వాటిల్లో మిరియాలు కూడా ఒకటి. వీటిని క్వీన్ ఆఫ్ స్పైసెస్‌గా పిలుస్తారు. వీటిని వంటల్లో ఉపయోగించడం వల్ల వంటల రుచి పెరగడంతోపాటు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. మిరియాలలోని పోషకాలతోపాటు ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. వీటి గొప్పతనం తెలుసుకున్న మన పూర్వీకులు మిరియాలను మన వంటల్లో భాగంగా చేశారు. ఆయుర్వేద వైద్యులు కూడా మిరియాలను అనేక రకాల అనారోగ్య సమస్యలను నయం చేయడంలో ఔషధంగా ఉపయోగిస్తున్నారు. మిరియాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం ఎన్నో రకాల ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. మిరియాల్లో యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు అధికంగా ఉంటాయి. మిరియాలను నేరుగా నమిలి తినగలిగిన వారు రోజూ ఉదయం పరగడుపున ఒకటి లేదా రెండు మిరియాలను నమిలి మిగడం వల్ల మనం అధిక ప్రయోజనాలను పొందవచ్చు. మిరియాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తద్వారా తరుచూ ఇన్ ఫెక్షన్ల బారిన పడకుండా ఉంటాం. అజీర్తి సమస్యతో బాధపడే వారు మిరియాలను పాత బెల్లంతో కలిపి తింటే ఫలితం ఉంటుంది. ఒక గ్లాస్ మజ్జిగలో మిరియాల పొడిని వేసి కలిపి తీసుకోవడం వల్ల ఈ సమస్య నుండి ఉపశమనం కలుగుతుంది.

# చింతపండు రసం ఆరోగ్య ప్రయోజనాలు




మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నారా? అయితే, అప్పుడు చింతపండు నీరు ట్రై చేయండి. సాధారణంగా ప్రతి ఇంట్లోనూ చింతపండును వివిధ వంటకాలలో ఉపయోగిస్తారు. కానీ, బరువు తగ్గేందుకు ప్రయత్నిస్తున్న వారు చింతపండు నీళ్లు తాగడం గురించి ఎప్పుడైనా విన్నారా..? ఈ పుల్లటి పానీయం మీకు రిఫ్రెష్ డ్రింక్‌గా పనిచేసి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. చింతపండు నీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మీ బరువు తగ్గించే ప్రయత్నాలకు ఎంతవరకు సహాయపడుతుందో ఇక్కడ తెలుసుకుందాం..చింతపండును భారతీయ ఖర్జూరంగా పిలుస్తారు. తీపి, పులుపు రుచితో ఉండే చింతపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చింతపండు రసంను తరచూ తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ మెరుగుపరుస్తుంది. చింతపండులో విటమిన్ బి, సి, యాంటీఆక్సిడెంట్లు, మెగ్నీషియం, ఐరన్ పుష్కలంగా లభిస్తాయి. శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గిస్తుంది. క్యాన్సర్‌తో సహా దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. చింతపండు జీర్ణ సమస్యలకు సహజ నివారణగా ఉపయోగిస్తారు. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. చింతపండు రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయుడుతుంది. చింతపండులో పాలీఫెనాల్స్, బయోఫ్లవనాయిడ్స్ వంటి శోథ నిరోధక సమ్మేళనాలు పుష్కలం. చింతపండు రసం శరీరంలో మంటను అరికట్టడంలో గొప్పగా పనిచేస్తుంది. చింతపండులో మెగ్నీషియం ఎముకలు ఏర్పడటంలో, గుండె లయను నియంత్రిస్తుంది. జీవక్రియను పెంచుతుంది: చింతపండులో హైడ్రాక్సీసిట్రిక్ యాసిడ్ (%ఎజూా%) పుష్కలంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. అధిక జీవక్రియ రేటు శరీరం విశ్రాంతిగా ఉన్నప్పుడు కూడా కేలరీలను మరింత సమర్థవంతంగా బర్న్ చేయడంలో సహాయపడుతుంది. చింతపండు నీటిని క్రమం తప్పకుండా తాగడం ద్వారా మీరు మీ జీవక్రియ రేటును పెంచుకోవచ్చు. చింతపండు నీటిని మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మీ బరువు తగ్గించే ప్రయత్నాలకు ఎంతవరకు సహాయపడుతుందో ఇక్కడ తెలుసుకుందాం..చింతపండును భారతీయ ఖర్జూరంగా పిలుస్తారు. తీపి, పులుపు రుచితో ఉండే చింతపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చింతపండు రసంను తరచూ తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ మెరుగుపరుస్తుంది.

# చికెన్ లివర్ ఇష్టంగా తింటున్నారా..!



మీరు మాంసాహారులైతే ఖచ్చితంగా చికెన్‌ను ఇష్టపడతారు. సహజంగానే ఇది రుచితో పాటు ఆరోగ్యకరమైనది కూడా. ఇతర మాంసంతో పోలిస్తే జీర్ణం కావడానికి తేలికగా ఉంటుంది. ఇది ప్రోటీన్‌కు మంచి మూలం. చికెన్ వంటకాలు ఎన్నో రకాలు. ఒక్కొక్కరూ ఒక్కో విధంగా తయారు చేస్తారు. ప్రతి పద్ధతి అద్భుతమైన రుచిని ఇస్తుంది. అయితే, చికెన్ కంటే కూడా చికెన్ లివర్ తింటే చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు పోషకాహార నిపుణులు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. నాన్ వెజ్ ఐటమ్స్ అనగానే నోట్లో నీళ్లు తిరుగుతాయ్ కొంతమందికి. ముఖ్యంగా చికెన్ లవర్స్ ఎక్కువగా ఉంటారు. కొంతమంది చికెన్ లివర్‌ను మరింత ఇష్టంగా తింటుంటారు. ఇది ఆరోగ్యానికి కూడా చాల మంచిది. ఎందుకంటే, చికెన్ లివర్ లో విటమిన్ ఎ, బి, ప్రోటీన్లు, మినరల్స్, ఐరన్, విటమిన్ బి 12, ఫొలేట్, కాల్షియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో సెలీనియం మంచి మొత్తంలో ఉంటుంది. ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చికెన్ లివర్‌తో కంటి, చర్మ, రక్త హీనత సమస్యలను దూరం చేస్తుంది. చికెన్ లివర్ హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచే ఐరన్, విటమిన్ B12 పుష్కలంగా ఉంటాయి. ఇది తినడం ద్వారా రక్త కణాలను పెంచుతుంది. రక్త హీనత తగ్గించడానికి సహాయపడుతుంది. చికెన్ లివర్ లో విటమిన్ K అధికంగా ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. మీ డైట్‌లో చికెన్ లివర్ తీసుకుంటే బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. చికెన్ లివర్ విటమిన్ B12 ఆరోగ్యకరమైన నాడి వ్యవస్థకు తోడ్పడుతుంది. జ్ఞాపకశక్తి, నిరాశ, అయోమయం, చిరాకు వంటి మానసిక సమస్యలు ఉన్నవారికి ఇంది మంచి ఆహారం.

# ఆరోగ్యానికి అద్భుత సంజీవని...!



గాయాలను తగ్గించడంలో అలోవెరా సహాయపడుతుంది. కాలిన గాయాల దగ్గర అలోవెరా రాసుకోవడంతో చర్మ కణాలు ఆరోగ్యంగా మారుతాయి. కొత్త కణాలు వేగంగా వృద్ధి చెందుతాయి. అలోవెరాలో విటమిన్ సీ, ఈ, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇవి యాంటీ ఏజింగ్ మాదిరి పని చేస్తాయి. అలోవెరా రాసుకోవడంతో చర్మంపై ముడతలు తగ్గుతాయి. నిత్యం యవ్వనంగా ఉండవచ్చు. కాలుష్యం, మారిన ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది మొటిమలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో అలోవెరా రాసుకోవడం ఉత్తమం. అలోవెరా రాసుకోవడంతో మొటిమలు తొలగుతాయి. అలోవెరా రాసుకోవడంతో చర్మం మెరుస్తుంది. అలోవెరా యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అలోవెరా చర్మంపై ఉన్న ముడతలు, మచ్చలను తొలగిస్తుంది. చర్మాన్ని తెల్లగా మార్చుతుంది. కలబంద రసాన్ని జుట్టుకు రాసుకోవడంతో ఒత్తైన, నల్లని నిగారించే జుట్టును పొందవచ్చు. అలోవెరా జ్యూస్ నెత్తికి రాసుకోవడంతో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అలోవెరా యాంటీ మైక్రోబయిల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చుండ్రును దూరం చేయడంలో సహాయపడతాయి.


# షుగర్ పేషెంట్లు లీచీ పండ్లు తింటే...



వేసవి అంటే రకరకాల పండ్ల సీజన్. పుచ్చకాయలు, మామిడిపళ్ల, పనసపండ్లు, ఖర్జూరం వంటి ఎన్నో రకాల పండ్లు మార్కెట్‌లో దర్శనమిస్తాయి. ఈ పండ్లన్నీ సాధారణంగా అందరూ ఎంతో ఇష్టపడి తింటారు. వేసవి పండ్లలో లిచ్చి కూడా ఒకటి. ఇది జ్యుసిగా, తినడానికి రుచిగా ఉంటుంది. అందుకే పిల్లలకు ఈ పండు అంటే చాలా ఇష్టం. స్వీట్స్ తినడానికి వీలులేని వృద్ధులు కూడా లిచ్చి పండ్లను ఆరగిస్తారు. లీచీలో పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్ బి కాంప్లెక్స్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి అనేక మినరల్స్ ఉంటాయి. కాబట్టి దీన్ని తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. లిచీ జ్యూసీగా ఉండే తీపి పండు. అందుకే లిట్చీ రక్తంలో చక్కెర స్థాయిని పెంచుతుందేమోనని చాలా మంది డయాబెటిక్ రోగులు లిచీ తినాలా.. వద్దా.. అనే ప్రశ్న సందిగ్ధంలో ఉంటారు. లిచీలో ఫైటోకెమికల్స్, బయెూ యాక్టివ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే డయాబెటిక్ రోగులు మాత్రం పరిమిత మొత్తంలో మాత్రమే తినాలి.





# దేవర టీం అండ్ ఫ్యామిలీతో థాయ్‌లాండ్‌కు తారక్.. క్రేజీ షెడ్యూల్ ఇదే




జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం దేవర. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రెండు పార్టులుగా విడుదల కానుండగా.. దేవర పార్టు 1 అక్టోబర్ 10న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు మేకర్స్. ఇప్పటికే దేవర నుంచి లాంఛ్ చేసిన ఫియర్ సాంగ్ నెట్టింటిని షేక్ చేస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాట మిలియన్లకుపైగా వ్యూస్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా నయా షూటింగ్ షెడ్యూల్ అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తారక్ ఫ్యామిలీ అండ్ దేవర టీంతో కలిసి థాయ్‌లాండ్‌కు వెళ్లాడు. లేటెస్ట్ టాక్ ప్రకారం ఇవాళ ఉదయం థాయ్‌లాండ్‌లో ల్యాండైంది తారక్ టీం. ఈ షెడ్యూల్‌లో జాన్వీకపూర్, తారక్‌పై వచ్చే సాంగ్‌ను చిత్రీకరించబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు షూటింగ్‌కు హాజరవుతూనే.. మరోవైపు ఫ్యామిలీతో కలిసి సరదా ట్రిప్‌కు సమయం కేటాయించాలనుకుంటున్నాడట జూనియర్ ఎన్టీఆర్. దేవర నుంచి లాంఛ్ చేసిన గ్లింప్స్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోండగా.. జాన్వీకి దేవర తెలుగు డెబ్యూ ప్రాజెక్ట్ కావడం విశేషం. ఇప్పటికే దేవర ఒరిజినల్ సౌండ్ ట్రాక్ AllHailTheTiger స్టన్నింగ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సెగలు పుట్టిస్తూ.. సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తున్నాడు. ప్రకాశ్ రాజ్, షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

## ఇంప్రెసివ్‌గా దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ శ్రీమతిగారు ప్రోమో

మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో లాంఛ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ శ్రీమతిగారు ప్రోమోను లాంఛ్ చేశారు మేకర్స్. శ్రీమణి రాసిన ఈ పాటను విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్ పాడారు. ఫ్యామిలీ థీమ్‌తో సాగుతున్న ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేయడం పక్కా అని ప్రోమో చెబుతోంది. అతడొక సాధారణ వ్యక్తి. సాధారణ భారతీయ మధ్యతరగతి వ్యక్తి.. నమ్మదగిన వ్యక్తి.. . ఒక సాధారణ బ్యాంక్ ఉద్యోగి ఖాతాలో ఇంత డబ్బా.. అంటూ సాగే డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ బ్యాంక్ ఉద్యోగిగా కనిపించబోతున్నాడు. మధ్యతరగతి బ్యాంక్ ఉద్యోగి ఖాతాలోకి అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేది సస్పెన్స్‌లో పెడుతూ కట్ చేసిన టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ మూవీలో మీనాక్షి చౌదరి సుమతి పాత్రలో కనిపించనుంది. లక్కీ భాస్కర్ ఎక్స్‌ట్రా ఆర్డినరీ ప్రపంచం చాలా సస్పెన్స్ ఎలిమెంట్స్ తో సినిమా ఉండబోతున్నట్టు టీజర్ ద్వారా చెబుతున్నాడు డైరెక్టర్. ఈ చిత్రాన్ని



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

# సెంటిమెంట్ రిపీట్..

## అల్లు అర్జున్ పుష్ప ది రూల్ కొత్త విడుదల తేదీ ఇదే

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్ పోషిస్తున్న ప్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న సీక్వెల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. కొన్ని రోజులుగా నెట్టింట చక్కర్లు కొడుతున్న పుకార్లే నిజమయ్యాయి. పుష్ప ది రూల్ ముందుగా నిర్ణయించిన ఆగస్టు 15న విడుదల కావడం లేదు. ఈ మూవీ కూడా పాత సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ..మళ్లీ డిసెంబర్ నెలలోనే విడుదల కానుంది. పుష్ప ది రూల్‌ను 2024 డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నట్టు తెలియజేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ లాంఛ్ చేసిన కొత్త పోస్టర్‌లో కత్తి పట్టుకుని ఊరమాస్ లుక్‌లో కనిపిస్తున్నాడు బన్నీ. 2021 డిసెంబర్ 17న విడుదలైన పుష్ప ది రైజ్ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబట్టింది. మరి సీక్వెల్ కూడా ఇదే లైన్‌లో వెళ్తుందా.. అనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా లాంఛ్ చేసిన పుష్ప పుష్ప సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. మరోవైపు రెండో సాంగ్ సూసేకి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. ఇటీవలే యూట్యూబ్‌లో 100 మిలియన్లకుపైగా వ్యూస్, 1.67 మిలియన్లకుపైగా లైక్స్‌తో నంబర్ వన్ స్థానంలో ట్రెండింగ్‌లో నిలిచింది. పుష్ప ది రూల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## మాజీ ఉద్యోగులకు మస్క్ హెచ్చరిక!



ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ఎలాన్ మస్క్ తన నిర్ణయాలు, వ్యాఖ్యలతో వార్తల్లోనిలుస్తుంటారు. తాజాగా ఆయన ఎక్స్(ట్విటర్) మాజీ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఉద్యోగుల్ని తొలగించిన సమయంలో చెల్లించాల్సిన దానికంటే అధిక మొత్తం ఇచ్చామని, దానిని వారు వెంటనే తిరిగి ఇచ్చేయాలన్నారు. 2022లో సోషల్ మీడియా సంస్థ ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. ఈ తర్వాత దాని పేరును ఎక్స్‌గా మార్చారు. అలాగే దాదాపు 80 శాతం మంది సిబ్బందిని తొలగించారు. ఆ సమయంలో వారికి పరిహారం చెల్లించారు. అయితే ఆస్ట్రేలియాలోని కొందరు ఉద్యోగులకు చెల్లించాల్సినదానికంటే ఎక్కువ ముట్టిందని ఎక్స్ వెల్లడించింది. కరెన్సీ కన్వర్షన్, షేర్ల మదింపు సమయంలో జరిగిన పొరపాట్లు ఈ పరిస్థితికి దారితీశాయని తెలిపింది. ఆ సంస్థ ఆసియా పసిఫిక్ మానవవనరుల విభాగ అధికారుల్ని ఉటంకిస్తూ సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ ఒక కథనాన్ని ప్రచురించింది. " మీరు వీలైనంత త్వరగా తిరిగి చెల్లింపులు చేస్తే సంతోషిస్తాం" అంటూ మాజీ ఉద్యోగులకు మెయిల్ పంపినట్లు పేర్కొంది. వారు చెల్లించాల్సిన మొత్తం 1500 డాలర్ల నుంచి 70 వేల డాలర్ల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. అలాగే ఆరుగురు మాజీలకు లీగల్ నోటీసులు అందినట్లు వెల్లడించింది. కొద్దినెలల క్రితం ఈ పరిహారం విషయంలో ఆ సంస్థ మాజీ ఉన్నతోద్యోగులు తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తమకు పెద్ద మొత్తంలో పరిహారం చెల్లించాల్సి ఉందని కోర్టులో దావా వేశారు. తమ బకాయిలను ఎగ్గొట్టడానికి మస్క్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సంస్థతో ఉన్న ఒప్పందం ప్రకారం.. ఒక ఏడాది వేతనంతో పాటు తమకిచ్చిన స్టాక్ అవార్డులకు విలువ కట్టి ఇవ్వాల్సి ఉందని పేర్కొన్న సంగతి తెలిసిందే.

## అమూల్ బాటలో మరో పాల కంపెనీ!




ద్రవ్యోల్బణం ప్రభావం ఇప్పుడు ఆహార పదార్థాలపై ఎక్కువగా కనిపిస్తోంది. పప్పులు, ఉప్పు అనే తేడా లేకుండా అన్ని రకాల వస్తువుల ధరలకు రెక్కలు వస్తున్నాయి. ఇప్పటికే అమూల్ కంపెనీ పాల ధరలు పెంచగా అదే బాటలో పరాగ్ మిల్క్ కూడా పయనిస్తోంది. తాజాగా పరాగ్ పాల ధరలను పెంచింది. దీంతో ఇక నుంచి ఒక లీటరు పరాగ్ పాలకు రూ.2 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ కంపెనీ కి చెందిన రెండు రకాల ప్యాక్‌ల ధరల్లో పెంపుదల చేసింది. దీంతో ఇక నుంచి మార్కెట్లలో పరాగ్ టోన్డ్ మిల్క్ రూ.54కి బదులు రూ.56లకు లభ్యం కానుంది. పరాగ్ గోల్డ్ ఒక లీటర్ ధర రూ.66 నుంచి రూ.68కి పెరిగింది. పరాగ్ మార్కెట్‌లో లభ్యమయ్యే 1 లీటర్ పాల ప్యాక్‌ల ధరలను పెంచినట్లు పరాగ్ డెయిరీ జీఎం వికాస్ బలియన్ తెలిపారు. దీంతో పాటు అరలీటర్ ప్యాకెట్లపై కూడా ఒక రూపాయి పెంచారు. పరాగ్ గోల్డ్ హాఫ్ లీటర్ ధర రూ.33 నుంచి రూ.34కి పెరిగింది. అంతేకాదు హాఫ్ లీటర్ పరాగ్ స్టాండర్డ్ ధర ఇప్పుడు రూ.30కి బదులుగా రూ.31గా ఉంది. అలాగే అరలీటర్ టోన్డ్ మిల్క్ ధర రూ.27కి బదులుగా ఇక నుంచి రూ.28లకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జూన్ 2న అమూల్ సహా ఇతర పాల ఉత్పత్తి కంపెనీలు ధరలు పెంచినట్లు పరాగ్ డెయిరీ జనరల్ మేనేజర్ తెలిపారు. వేడి కారణంగా పాల ఉత్పత్తి కూడా తగ్గుతోంది. పరాగ్ కంపెనీ నుంచి ప్రతి రోజూ దాదాపు 33 వేల లీటర్ల పాలు సరఫరా అవుతోంది. రైతులు కూడా పాల పెంచడంతో.. తమ కంపెనీ కూడా పాల ధరను పెంచాల్సి వచ్చిందని వెల్లడించింది. అమూల్ కొత్త ధరల ప్రకారం అమూల్ గోల్డ్ హాఫ్ లీటర్ ఇప్పుడు రూ.32 నుంచి రూ.33కి పెరిగింది. అమూల్ తాజా 500 ఎంఎల్ ప్యాకెట్ ధర రూ.26 నుంచి రూ.27కి పెరిగింది. అమూల్ శక్తి 500 ఎంఎల్ ప్యాకెట్ ధర రూ.29 నుంచి రూ.30కి పెరిగింది. అముల్ తాజా చిన్న ప్యాకెట్లు మినహా అన్ని అమూల్ పాల ధరలను లీటరుకు రూ.2 మేర పెంచారు. అమూల్ గోల్డ్ 500ml ప్యాక్ ఇప్పుడు మార్కెట్ లో రూ. 33కి అందుబాటులో ఉంటుంది.

# హ్యుందాయ్ కీలక నిర్ణయం......




దక్షిణ కొరియాకు చెందిన ఆటో మొబైల్ దిగ్గజ సంస్థ హ్యుందాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. తన భారత విభాగాన్ని పబ్లిక్ ఇష్యూకు తీసుకురానున్నట్లు ప్రకటించింది. భారతదేశంలోనే అతిపెద్ద ఐపీఓగా హ్యుందాయ్ అవతరించనుంది. ఇదిలా ఉంటే సుమారు రెండు దశాబ్దాల తర్వాత స్టాక్ మార్కెట్లోకి వస్తున్న తొలి వాహన కంపెనీగా హ్యుందాయ్ నిలవనుంది. దీనికి సంబంధించి కీలక విషయాలు బయటకు వచ్చాయి. హ్యుందాయ్ తన భారత విభాగానికి సంబంధించి కనీసం రూ. 25,000 కోట్ల సమీకరణ చేపట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించి త్వరలోనే మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలను దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే జపాన్‌కు చెందిన ప్రముఖ వాహన దిగ్గజం మారుతీ సుజుకీ ఎక్స్ఛేంజీల్లో నమోదైన విషయం తెలిసిందే. కాగా ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓకు సెబీ నుంచి ఈ వారం మొదట్లో అనుమతులు దక్కాయి. హ్యుందాయ్ ఐపీఓకి వెళ్లే ముందు విస్తరణను పెంచే ఉద్దేశంతో ఉంది. 2025 నాటికి హ్యుందాయ్ తన వార్షిక ఉత్పత్తిని 10 లక్షల యూనిట్లకు పెంచుంతుందని కంపెనీ పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై కంపెనీ దృష్టిసారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే హ్యుందాయ్ ప్రతిపాదించిన ఐపీఓ కింద హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్ఎమ్ఐఎల్) 15-20 శాతం వాటాను విక్రయించి 3- 5.6 బిలియన్ డాలర్ల వరకు సమీకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయమై త్వరలోనే పత్రాతలను సెబీకి సమర్పించనుందని కంపెనీ చెబుతోంది. ఇదిలా హ్యుందాయ్ కంపెనీ ఇండియాలో 1996లో భారత కార్యకలాపాలు మొదలు పెట్టింది. ప్రస్తుతం ఈ సంస్థ మార్కెట్లో 13 మోడళ్లను విక్రయిస్తోంది. గత ఏడాది మేతో పోలిస్తే ఈ ఏడాది మేలో 7% వృద్ధితో 63,551 వాహనాలను ఇది విక్రయించింది.

# యమహా కొత్త వేరియంట్‌తో సెన్సేషన్....!



యమహా బ్రాండ్‌కు మన దేశంలో మంచి డిమాండ్ ఉంది. కేవలం ఆ బ్రాండ్ కు వ్యాల్యూని బట్టే దాని ఉత్పత్తుల అమ్మకాలు కొనసాగుతాయి. కాగా స్కూటర్ల విషయంలో యమహా నుంచి విజయవంతమైన మోడల్ యమహా ఫాసినో 125. ఇప్పుడు దీని కొత్త వేరియంట్‌ను మార్కెట్లోకి లాంచ్ చేసింది. ఏకంగా 5 మోడళ్లు ఈ కొత్త వేరియంట్లో ఉన్నాయి. అంతేకాక ఇందులో వినూత్నమైన 'ఆన్సర్ బ్యాక్' ఫంక్షన్ ఉంది. ఈ లేటెస్ట్ మోడల్ మాట్ రెడ్, మ్యాట్ బ్లాక్ రంగులలో అందుబాటులో ఉంది. దీని ధర రూ. 93,730, డార్క్ మ్యాట్ బ్లూ రూ. 94,530 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ). కాగా ఈ యమహా ఫాసినో ఎస్ 125సీసీ స్కూటర్ ఇప్పటి భారతీయ మార్కెట్లో ఉత్తమంగా ఉన్న సుజుకి బర్గ్‌మాన్ స్ట్రీట్ 125, హెరిండా యాక్టివా 125, టీవీఎస్ జూపిటర్ 125, హీరో డెస్టినీ 125 వంటి ఇతర ప్రముఖ మోడళ్లతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉంది. ఈ కొత్త ఫాసినో ఎస్ స్కూటర్ ప్రత్యేక ఫీచర్ 'ఆన్సర్ బ్యాక్' ఫంక్షన్. ఇది యజమానులు తమ స్కూటర్ను దూరం నుంచి గుర్తించడంలో సహాయపడుతుంది. రెండు సైడ్ ఇండికేటర్లు, హారన్‌ను దాదాపు రెండు సెకన్ల పాటు యాక్టివేట్ చేయడం ద్వారా, ఈ ఫీచర్ వినియోగదారులు రద్దీగా ఉండే లేదా మసక వెలుతురు ఉన్న ప్రాంతాల్లో తమ స్కూటర్ను సులభంగా కనుగొనవచ్చు. సాధారణంగా ఇది కార్లలో ఉంటుంది. స్కూటర్లో ఈ ఫంక్షన్ ను ఉపయోగించడానికి, యజమానులు గూగుల్ ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుంచి Yamaha Scooter Answer Back యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత యాప్లోని ఆన్సర్ బ్యాక్ ఎంపికను నొక్కాలి. కొత్త ఫీచర్తో పాటు, ఫాసినో ఎస్ సైలెంట్ స్టార్టర్, సాధారణ, ట్రాఫిక్ మోడ్లతో ఆటోమేటిక్ స్టార్ట్-స్టాప్ ఫంక్షన్తో సహా అనేక ప్రత్యేక సౌకర్యాలను కలిగి ఉంది. ఈ ఫీచర్లు స్కూటర్ సౌలభ్యం, ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి, ఇది పట్టణ ప్రయాణాలకు ఆచరణాత్మక ఎంపికగా చేస్తుంది. ఈ లేటెస్ట్ మోడల్ మాట్ రెడ్, మ్యాట్ బ్లాక్ రంగులలో అందుబాటులో ఉంది. దీని ధర రూ. 93,730, డార్క్ మ్యాట్ బ్లూ రూ. 94,530 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ). కాగా ఈ యమహా ఫాసినో ఎస్ 125సీసీ స్కూటర్ ఇప్పటి భారతీయ మార్కెట్లో ఉత్తమంగా ఉన్న సుజుకి బర్గ్‌మాన్ స్ట్రీట్ 125, హెరిండా యాక్టివా 125, టీవీఎస్ జూపిటర్ 125, హీరో డెస్టినీ 125 వంటి ఇతర ప్రముఖ మోడళ్లతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉంది. ఈ కొత్త ఫాసినో ఎస్ స్కూటర్ ప్రత్యేక ఫీచర్ 'ఆన్సర్ బ్యాక్' ఫంక్షన్.

# ఎగిసిన టోకు ద్రవ్యోల్బణం



**న్యూఢిల్లీ :** అహారోత్పత్తుల ధరలు అమాంతం పెరగడంతో దేశంలో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) ఎగిసి పడింది. 2024 మేలో 2.61 శాతానికి ఎగిసి.. 15 నెలల గరిష్ట స్థాయికి చేరినట్లు ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. ఫిబ్రవరి 2023లో 3.85 శాతం పెరిగింది. ఆ తర్వాత ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. 2023 మేలో 3.48 శాతంగా నమోదయ్యింది. గడిచిన నెలలో అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం ఏకంగా 9.82 శాతానికి ఎగిసింది. ఈ సూచీ గతేడాది ఇదే నెలలో 1.63 శాతంగా ఉంది. టోకు కూరగాయల ధరలు 32.42 శాతం పెరిగాయి. ఈ సూచీ గతేడాది మేలో 20.5 శాతంగా నమోదయ్యింది. ఇదే సమయంలో 18.1 శాతంగా ఉన్న ఆలు ధరల సూచీ.. గడిచిన నెలలో ఏకంగా 64 శాతం ఎగిసింది.

## ఆరోగ్య బీమాలోకి వచ్చే ప్రతిపాదనలు లేవు...

ఆరోగ్య బీమా విభాగంలోకి రావాలనే ప్రతిపాదనలు ప్రస్తుతానికి లేవని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వెల్లడించింది. ఈ మేరకు శుక్రవారం స్టాక్ మార్కెట్లకు సమాచారం ఇచ్చింది. 'సంస్థ వృద్ధి, విస్తరణ కోసం ఉన్న అన్ని అవకాశాలనూ వ్యూహాత్మకంగా వినియోగించుకుంటాం. ఇందులో భాగంగా కొన్ని భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం, పెట్టుబడులు పెట్టడం లాంటి చర్యలు కొనసాగుతాయి' అని అందులో పేర్కొంది. ప్రస్తుతం బీమా చట్టం 1938 ప్రకారం జీవిత బీమా సంస్థలు ఆరోగ్య బీమా పాలసీలను అందించడం కుదరదు. వీటిని సాధారణ బీమా సంస్థలు, లేదా ఆరోగ్య బీమా సంస్థలు అందించాలి. ఈ నిబంధనలను మార్చి, బీమా సంస్థలకు కాంపోజిట్ లైసెన్సు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ఒక పార్లమెంటరీ కమిటీని నియమించింది. ఫిబ్రవరిలో ఈ కమిటీ తన నివేదికను అందిస్తూ.. జీవిత, సాధారణ, ఆరోగ్య బీమా పాలసీలన్నీ ఒకే సంస్థ నుంచి ఇచ్చేందుకు వీలు కల్పించాలని, తద్వారా బీమా విస్తృతి పెరుగుతుందని పేర్కొంది.

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

## 7 నెలల గరిష్ఠానికి దేశ వాణిజ్య లోటు...!




**న్యూఢిల్లీ :** మేలో భారత ఎగుమతులు 9.1 శాతం పెరిగి 38.13 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు కూడా 7.7 శాతం అధికమై 61.91 బిలియన్ డాలర్లకు చేరాయి.దీంతో దేశ వాణిజ్య లోటు ఏడు నెలల గరిష్ఠమైన 23.78 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2023 అక్టోబరులో నమోదైన 31.46 బిలియన్ డాలర్ల తర్వాత ఇదే అత్యధిక వాణిజ్య లోటు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, జౌళి, ఔషధం, ప్లాస్టిక్ ఎగుమతులు దేశీయ ఎగుమతుల వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. ముడి చమురు దిగుమతులు పెరగడం దేశీయ దిగుమతులు అధికంగా నమోదుకావడానికి కారణమైంది. మేలో చమురు దిగుమతులు 28 శాతం పెరిగి 20 బిలియన్ డాలర్లకు చేరాయి. 2024-25 ఏప్రిల్- మేలో చమురు దిగుమతులు 24.4 శాతం పెరిగి 36.4 బిలియన్ డాలర్లుగా నమోదుకావడం గమనార్హం. అయితే మేలో పసిడి దిగుమతులు 3.69 బిలియన్ డాలర్ల నుంచి స్వల్పంగా తగ్గి 3.33 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- మేలో ఎగుమతులు 5.1 శాతం పెరిగి 73.12 బిలియన్ డాలర్లకుబీ దిగుమతులు 8.89 శాతం అధికమై 116 బిలియన్ డాలర్లకు చేరాయి. 'దేశీయ ఎగుమతులు మేలో ఆకర్షణీయ స్థాయిలో నమోదయ్యాయి. మున్ముందూ ఇదే ధోరణి కొనసాగుతుందని భావిస్తున్నామ'ని వాణిజ్య కార్యదర్శి సునిత్ భర్త్వాల్ తెలిపారు. 2023 అక్టోబరులో నమోదైన 31.46 బిలియన్ డాలర్ల తర్వాత ఇదే అత్యధిక వాణిజ్య లోటు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, జౌళి, ఔషధం, ప్లాస్టిక్ ఎగుమతులు దేశీయ ఎగుమతుల వృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. ముడి చమురు దిగుమతులు పెరగడం దేశీయ దిగుమతులు అధికంగా నమోదుకావడానికి కారణమైంది.

# రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ...

## కాంగ్రెస్ సర్కార్ పై హరీశ్ గరం గరం

- ఆశా వర్కర్లకు జీతాలు ఏవీ
- గ్రూప్ వన్ పోస్టులు ఎందుకు పెంచలేదు
- పింఛన్ కోసం అవ్వతాతలు పడిగాపులు



హైదరాబాద్: తెలంగాణలో ఉద్యోగ నియామకాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీశ్ రావు. నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చకపోతే త్వరలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ గ్రూప్స్ ఉద్యోగాలు పెంచాలని అడిగిందని, మరి ఇప్పుడు ఎందుకు పోస్టులు పెంచడం లేదని నిలదీశారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో పాస్ అయిన విద్యార్థులకు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్ ఎగ్జామ్‌కు అవకాశమివ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అభ్యర్థులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని తెలిపారు.

ప్రభుత్వం వచ్చి ఆరు నెలలయిందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. పింఛన్ ఎప్పుడిస్తారని అవ్వతాతలు అడుగుతున్నారని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా పెన్షన్ వచ్చేదని అంటున్నారని తెలిపారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్ రావడం లేదని వెల్లడించారు. అవ్వతాతలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న పింఛన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో తీసుకున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజాపాలన ఆచరణలో ఏమైందన్నారు. పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. ఏపీ సీఎం మొదటి సంతకంతో పింఛన్ రూ.4 వేలకు పెంచారని, మీరు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. పక్కన ఆంధ్రప్రదేశ్ ఇచ్చినప్పుడు మీరెందుకు ఇవ్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వికలాంగులకు రూ.6 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలన్నారు. చేనేత, గీత కార్మికులకు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ పేషెంట్లకు బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున పింఛన్ ఇచ్చామని చెప్పారు. ఇంటికి రెండు పింఛన్లు ఇస్తామన్నారని గుర్తుచేశారు.

**ఆశా వర్కర్ల జీతాలు ఏవీ...**

ఉద్యోగులకు ప్రతి నెలా 1న జీతాలు ఇస్తే ఆశా వర్కర్లు ఎందుకు వైద్యవిధాన పరిషత్‌కు వస్తారని ప్రశ్నించారు. ఎన్‌హెచ్‌ఎం కింద 17 వేల మంది పనిచేస్తున్నారని, వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు నెలల నుంచి సఫాయి కార్మికులకు ఎందుకు వేతనాలు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. వెంటనే గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులపై కేసీఆర్ బొమ్మ ఉందని ఇవ్వట్లేదని, 1.5 లక్షల మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు రోడ్లు ఎక్కుతున్నారని, 60వేల మంది జీతాల కోసం వేచిచూస్తున్నారన్నారు. తమ హయాంలో వారికి జీతాలు ఆపలేదన్నారు.

# ఈసారి ఖైరతాబాద్‌లో పర్యావరణహిత గణేశుడు: దానం



హైదరాబాద్: ఈసారి గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ లో 70 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని పెట్టనున్నట్లు ఎంఎల్ఏ దానం నాగేందర్ తెలిపారు. గణేశ్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన కర్రపూజ పూర్తయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. ఈసారి ఖైరతాబాద్ లో పర్యావరణహిత(ఎకో ఫ్రెండ్లీ) విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. గతంలో కంటే మెరుగ్గా గణేశ్ ఉత్సవాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి భక్తుడికి ప్రసాదం అందేలా చూస్తామని కూడా ఆయన తెలిపారు.

## ఈవిఎంలను హ్యాకింగ్ చేయడం సాధ్యమే: శ్యామ్ పిట్రోడా



న్యూఢిల్లీ : పోలింగ్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవిఎం) హ్యాకింగ్‌కు గురవుతున్నాయంటూ టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలు దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే ఈ వ్యవహారంపై తాజాగా కాంగ్రెస్ నేత శ్యామ్ పిట్రోడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈవీఎం మిషన్లను హ్యాక్ చేయడానికి, ఫలితాలను తారుమారు చేయడానికి అవకాశం ఉన్నట్టు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. "ఎలక్ట్రానిక్స్, ఐటీ, సాఫ్ట్‌వేర్, కాంప్లెక్స్ సిస్టంల రంగాల మీద సుమారు అరవై ఏళ్ల పాటు నేను పనిచేశాను. అదే విధంగా నేను ఈవీఎం యంత్రాల వ్యవస్థను కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. ఈవీఎంలను హ్యాక్ చేయటం సాధ్యం అవుతుంది. దీనివల్ల ఫలితాలు మారిపోతాయి. ఇలాంటి సమయంలో సంప్రదాయ పాత బ్యాలెట్ ఓటింగ్ విధానమే చాలా ఉత్తమమైనది. ఓట్ల ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు జరగవు. బ్యాలెట్ విధానాన్నే ఎన్నికల్లో అనుసరించాలి" అని అన్నారు. పోలింగ్‌లో ఉపయోగించే ఈవీఎం మిషన్లతోపాటు, వీవీప్యాట్ స్లిప్స్ కోసం వీవీప్యాట్ యంత్రాలు కూడా అమర్చబడి ఉన్నాయి. వీవీప్యాట్ యంత్రాల సాయంతో కూడా ఈవీఎంలను హ్యాక్ చేయడానికి అవకాశం ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది " అని అన్నారు.

# జెకె బస్సు దాడిపై దర్యాప్తు ఎన్ఐఎకు అప్పగింత




న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లో ఇటీవల ఒక బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడిపై దర్యాప్తు బాధ్యతను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ సోమవారం అప్పగించింది. ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ నుంచి యాత్రికులతో వెళుతున్న ఒక బస్సుపై ఉగ్రవాదులు ఈ నెల 9న జమ్మూ కాశ్మీర్ రియాసి జిల్లాలో దాడి జరపడంతో బస్సు ఒకలోతైన లోయలో పడిపోగా ముగ్గురు మహిళలతో సహా తొమ్మిది మంది వ్యక్తులు మరణించారు. 41 మంది గాయపడ్డారు. 53 సీట్ల బస్సు శివ్ ఖోరి నుంచి కాత్రాలో మాతా వైష్ణో దేవి ఆలయానికి వెళుతుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. జమ్మూ కాశ్మీర్‌లో ఒక బస్సుపై ఈ నెల 9 నాటి ఉగ్ర వాడిపై దర్యాప్తును ఎన్ఐఎకు అప్పగించినట్లు అధికారి ఒకరు తెలిపారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిస్థితిని, వార్షిక అమర్‌నాథ్ యాత్రకు సన్నాహాలను ఢిల్లీలో రెండు వరుస సమావేశాల్లో సమీక్షించిన మరునాడు ఈ నిర్ణయం వచ్చింది.

# దేశంలో కోటి ఫ్లాట్స్ ఖాళీగా పడి ఉన్నాయి: జి. హరిబాబు



హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రంగంలో ప్రీమియమైజేషన్ పెరిగిపోతున్నట్లు నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్ జాతీయ ప్రెసిడెంట్ జి. హరిబాబు అభిప్రాయపడ్డారు. ఆఫర్డేబుల్ ఇళ్లకు డిమాండ్ ఉన్నప్పటికీ వాటి సప్లయ్ తక్కువగానే ఉందన్నారు. 2019 నుంచి 2013 మధ్య కాలంలో రూ. 1.5 కోట్లకు మించిన రెసిడెన్షియల్ యూనిట్లు 1000 శాతం పెరిగాయని ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ పేర్కొంది. ఏడు ప్రధాన నగరాలలో రూ. 75 లక్షల కన్నా తక్కువ ఉన్న లేక ఆఫర్డేబుల్ ఇళ్ల సప్లయ్ మందకొడిగా ఉందని అగ్గమ్ వాలియాకు మాటామంతీలో పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో కేవలం హై నెట్వర్త్ వ్యక్తులకే అవకాశం ఉంటోదన్నది పచ్చి నిజం. మెట్రో నగరాలలో కేవలం హై నెట్ వర్త్ ఉన్నవారే ఇళ్లను కొనగలుగుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో వారిదే హవా నడుస్తోంది. మెట్రో నగరాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులే కథ అంతా నడుపుతున్నారు. హరిబాబు కథనం ప్రకారం 2022లో హైదరాబాద్ లో 5300 ఆఫర్డబుల్ హోమ్స్ లేక ఫ్లాట్స్ అమ్ముడయ్యాయి. కానీ 2023 కల్లా అమ్మడయినవి దాదాపు 1500 ఫ్లాట్సే. అదే సమయంలో లగ్జరీ ఇండ్లు ఎక్కువ అమ్ముడయ్యాయి. కొందరి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. కానీ వెల్త్ డిస్ట్రిబ్యూషన్ చూస్తే మాత్రం నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా కనబడుతోంది. 31.5 శాతం సంపద కేవలం 1 శాతం మంది చేతుల్లోకి వెళ్లిపోయింది. మరో 31.5 శాతం సంపద 9 శాతం మంది చేతుల్లోకి పోయింది. లెక్క ప్రకారం రియల్ ఎస్టేట్ రంగం కేవలం 10 శాతం మాత్రమే వృద్ధి చెందింది. అంటే 14 కోట్ల మందే ఆ డబ్బు పెట్టి ఇండ్లు కొనుకున్నారు. చాలా మంది రియల్ ఎస్టేట్ బిల్డర్లు కేవలం 10 శాతం మందికి అనుగుణంగానే ఇండ్లను కట్టి అమ్ముతున్నారు.

# కేంద్ర నిధులతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తా: ఎంపీ నగేష్




తలమడుగు: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పరుస్తానని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. ఇవాళ మండలం కేంద్రంలో బీజేపీ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చేరుకున్న ఎంపీ గోడం నగేష్ మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మండలంలోని వెంకటేష్ స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ సభలో ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ... ఈ విజయం పార్టీ కార్యకర్తలది, జిల్లా ప్రజలదని గుర్తు చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి పనిలోనూ ముందుంటూ కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా జిల్లాను అభివృద్ధి పరుస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం మండల అధ్యక్షులు బోనగిరి స్వామి, ఉపాధ్యక్షులు నక్క ధనుంజయ్, ప్రధాన కార్యదర్శి ముత్యాల దేవన్న, బీజేవైఎం మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, తాంసి జడ్పిటిసి రాజు, కనపర్తి, చంద్రకాంత్, వెంకటస్వామి, శార్త స్వామి, నాగార్జున రెడ్డి, కాంతారావు, ఓ బి సి మోర్చా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు ప్రణీత్ రెడ్డి, పిట్ల శేఖర్, కిసాన్ మోర్చ అధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల ఆశన్న, నారాయణరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వంద పడకల ఆస్పత్రికి రూ.17.5 కోట్లు మంజూరు.. ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల: చేవెళ్ల ఆసుపత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా డయాలసిస్ వార్డులో జరిగిన సంఘటన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా డయాలసిస్ వార్డును పరిశీలించారు. సమస్య పరిష్కరించి డయాలసిస్ వార్డులో వైద్యసేవలు కొనసాగుతున్నాయని వైద్యులు ఎమ్మెల్యే కు చెప్పారు. ఆస్పత్రిలోని ఇతర వార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేవెళ్ల ఆస్పత్రి వంద పడకల కోసం రూ.17.5కోట్ల నిధులు మంజూరయ్యా యని ఎమ్మెల్యే చెప్పారు. చేవెళ్లలోని అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# ఫలితాలప్పుడు లేని ఆందోళన ఎలాన్ మస్క్ పోస్ట్ తర్వాత ఎందుకు : ఈవీఎంలపై కేసీ త్యాగి



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారని వస్తున్న ఆరోపణలపై.. ఎన్డీఏ కూటమిలోని మిత్రపక్ష పార్టీ జేడీయూ కు చెందిన సీనియర్ నేత కేసీ త్యాగి స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజున ఎవరు కూడా ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయలేదని, ఇప్పుడు ఎలాన్ మస్క్ సోషల్ మీడియాలో పోస్టు చేసిన తర్వాత అందరూ ఆరోపణలు చేస్తున్నారని త్యాగి విమర్శించారు. అయినా ఆదివారం కేంద్రం ఎన్నికల సంఘం ప్రెస్ మీట్ పెట్టి చేసిన ప్రకటనతో ఆ అనవసరపు చర్చ ముగిసిపోవాలని కేసీ త్యాగి అన్నారు. అదేవిధంగా లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అంశంపై కూడా త్యాగి స్పందించారు. 'ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎన్డీఏ పక్షాలతో సమావేశమై స్పీకర్ ఎంపికపై చర్చించారు. మేము మా అభిప్రాయాలు వెల్లడించాం. జేడీయూ ఏ పదవికి పోటీలో లేదు. బీజేపీ ప్రతిపాదించిన అభ్యర్థికే మేం మద్దతిస్తాం' అని త్యాగి చెప్పారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం.. ఈదురుగాలుల విధ్వంసం



హైదరాబాద్‌లో సోమవారం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురవగా.. పెనుగాలులకు పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, రాజేంద్రనగర్, అత్తాపూర్, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, లంగర్‌హౌస్, గండిపేట, శివరాంపల్లిలో భారీ వర్షం నమోదైంది. అలాగే పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బేగంపేట, సికింద్రాబాద్, గచ్చిబౌలి, మణికొండ, షేక్‌పేట, కొండాపూర్, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com